

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 79 | ది.23-5-2025 | విజయవాడ | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## నేటి రాత్రికి ఢిల్లీ కి సిఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి,మే 22 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేటి రాత్రి ఢిల్లీకి చేరుకోనున్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా 23వ తేదీ 7 గురు కేంద్ర మంత్రులతో సిఎం సమావేశం కానున్నారు. రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, కేంద్ర పథకాలపై మంత్రులతో చర్చించి సహకారం కోరనున్నారు. ఢిల్లీ భేటీలో సిఎం చంద్రబాబు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్ జోషి, అశ్వినీ వైష్ణవ్, సిఆర్ పాటిల్, జితేంద్ర సింగ్ లతో భేటీ కానున్నారు. ఢిఫెన్స్ పరిశ్రమలు, స్పేస్ మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ తయారీ పరిశ్రమలు, పోలవరం బనకచర్లకు కేంద్ర సాయం, ప్రతి ఇంటికీ తాగునీరు, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు, తదితర అంశాలపై సిఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో ప్రధానంగా చర్చించనున్నారు.

# తిరుమల భక్తులకు మ్యాంగో జ్యూస్..!

## - క్యాబినెట్ సబ్ కమిటీతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం చంద్రబాబు

- మధ్యాహ్న పథకంలో కూడా అందించే అంశం పరిశీలించాలి..
- రైతులు నష్టపోకుండా డిమాండ్ ఉన్న పంటల్ని మాత్రమే సాగయ్యేలా చూడాలి..
- రైతాంగ సమస్యపై ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో చర్చిస్తా..
- ఈ ఏడాది హెచ్డీ బర్లే పొగాకు రకానికి క్రాప్ హాలిడే



**అమరావతి, మే 22 (వార్తాప్రభ) :** పంటల వారీ సాగు ప్రణాళికపై వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఏ పంటలు ఎంతమేర విస్తీర్ణంలో సాగు చేయాలో రైతులకు ముందే చెప్పడం వల్ల డిమాండ్, సప్లయ్ మధ్య సమతూకం ఉంటుందన్నారు. పొగాకు, కోకో, మామిడి, ధాన్యం రైతుల సమస్యలపై సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం అధికారులు, మంత్రులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీ క్ష జరిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పంటల ప్రణాళిక అనేది చాలా శాస్త్రీయంగా జరగాలని, జాతీయ అంతర్జాతీయ ప్రరిణామాలు, మార్కెట్లు, దిగుబడులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆర్టీజీఎస్, వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం క్యాబినెట్ సబ్ కమిటీ దృష్టిపెట్టాలన్నారు. రైతుల దగ్గర ఉన్న కోకో పంట నిల్వలను కేజీ రూ.500కు కంపెనీల ద్వారా కొనుగోళ్లు జరిపేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు ప్రస్తుతం 1,200 మెట్రిక్ టన్నుల నుంచి 1500 మెట్రిక్ టన్నుల కోకో నిల్వలు ఉన్నాయని... వీటిలో 600 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతుల దగ్గర ఉన్నాయని వాటిని మాత్రమే కొనుగోళ్లు చేయాల్సి ఉందని అధికారులు మునిల్వలను కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. హెచ్డీ బర్లే, వైట్ బర్లే రకాలను టొబాకో బోర్డులో చేర్చాల్సిందిగా ముఖ్యమంత్రి ఇప్పటికే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి లేఖ రాశారు. అలాగే ఈ వారం తన ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో రైతాంగ సమస్యలపై చర్చిస్తానని సీఎం తెలిపారు. మామిడి రైతులు ఆందోళన చెందకుండా తక్షణమే పల్ప్ ప్రాసెసింగ్ కంపెనీలు కొనుగోళ్లు జరిపేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పల్ప్ ప్రాసెసింగ్ కంపెనీలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేలా అధికారులు చూడాలని సీఎం అన్నారు.మ్యాంగో పల్ప్ జ్యూస్ వినియోగం పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్ధులకు అందించడంతో పాటు... తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ మ్యాంగో జ్యూస్ అందించే అంశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో టొమాటో ప్రాసెసింగ్ యూనిట్లు పెరిగేలా ప్రోత్సహించి.. రైతులు ఆశించిన ధర వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. మరోవైపు ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్య లేదని, ఏ ప్రాంతాల్లో అయితే తడి చిన ధాన్యం ఉందో వాటిని కూడా కొనుగోలు చేశామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదండ్ల మనోహర్, గొట్టిపాటి రవి, రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదిత రులు పాల్గొన్నారు.

# 12 నెలల్లోనే 1,37,546 లక్షల కోట్లు అప్పు

## మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపణలు

- కేసీఆర్ రూ.616 కోట్లతో అద్భుతంగా కట్టాడు.. మీకెందుకు అంత ఖర్చు..?
- ఆ భవన నిర్మాణాలకు. రూ.600 కోట్లు వృధా కదా..?
- గతంలో అసెంబ్లీ, సచివాలయం కట్టారు..
- ఇప్పుడు మళ్లీ కొత్త బిల్డింగులు ఎందుకు?
- ప్రజలపై అప్పుల భారం మోపటం కాదా?



**తాడేపల్లి, మే 22 (వార్తాప్రభ) :** హైదరాబాద్ లో కేసీఆర్ 8 లక్షల స్క్వేర్ ఫీట్లలో రూ.616 కోట్లతో అద్భుతమైన సెక్రటేరియట్ నిర్మించారు.. చంద్రబాబు నాయుడు 53,57,000 స్క్వేర్ ఫీట్లలో సెక్రటేరియట్ నిర్మించడం ఏంటి ? అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. అమరావతిలో 600 కోట్ల రూపాయలు ఖర్చు చేసి గతంలో అసెంబ్లీ, సచివాలయాలు భవనాలు కట్టి ఇప్పుడు వాటిని వదిలేసి మళ్లీ అసెంబ్లీ సచివాలయాలు కడతానని చెప్పడం వృధా కాదా అని ప్రశ్నించారు. తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ అంటూ అందరినీ మభ్యపెడుతున్నారని అన్నారు. అదే అమరావతి కోసం చేస్తున్న అప్పులు ఇప్పుడు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆరోపించారు. చంద్రబాబు చేస్తున్న పనికి విజయవాడ, గుంటూరులో రియల్ ఎస్టేట్ పడిపోయింది అన్నారు. తమ ఐదేళ్ల పాలనలో 3,32,671 లక్షల కోట్లు అప్పు చేస్తే చంద్రబాబు నాయుడు 12 నెలల్లోనే 1,37,546 లక్షల కోట్లు అప్పు చేశారని మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్ ఆరోపించారు. మేం ఐదేళ్లలో చేసిన అప్పు బాబు ఏడాదిలోనే చేశారని అన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెప్పాడని గుర్తు చేశారు. బాబు ఏడాది పాలనలో పెట్టుబడులు తగ్గాయి.. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందన్నారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయం రావడంలేదని తెలిపారు. రాష్ట్ర ఆదాయమంతా గజదొంగల జేబుల్లోకి వెళుతుందని ఆరోపించారు. ఏపీఎండీసీకి గనులు తాకట్టుపెట్టి 9వేలకోట్లు చంద్రబాబు అప్పు చేశారని అన్నారు. 293 (1) ప్రకారం బాబు అప్పులు చేసే విధానం చట్ట విరుద్ధం అని తెలిపారు. ఏపీఎండీసీ భవిష్యత్ ను అంధకారంలోకి నెట్టారని ఆరోపించారు. విద్యుత్ కొనుగోలులో రూ.11వేల కోట్ల స్కామ్ జరిగిందని అన్నారు. యాక్సిస్ సంస్థ నుంచి యూనిట్ కు రూ.4.60 చొప్పున కొన్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తులకు దోచి పెట్టారని అన్నారు. 4 గంటల పీక్ అవర్ కోసం అంటూ..24 గంటలకు యూనిట్ కు రూ.4.60 చొప్పున కొనుగోలు చేశారు.మా హయాంలో సెకీతో విద్యుత్ ఒప్పందం చేసుకున్నాం.. మా హయాంలో యూనిట్ కు రూ.2.49లకే విద్యుత్ కొన్నాం.. విద్యుత్ కొనుగోలులో రాష్ట్ర ఆదాయం ఆదా చేశాం అని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, మట్టి మాఫియా చెలరేగిపోతుందని అన్నారు. అమరావతి టెండర్ల పేరుతో మరో దోపిడీకి తెర తీశారని అని ఆరోపించారు.

**విజయసాయి.. చంద్రబాబుకు లొంగిపోయాడు..** విజయసాయి రెడ్డి చంద్రబాబు లొంగిపోయాడని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. చంద్రబాబు నాయుడుకి మేలు చేసేందుకు విజయసాయి మూడున్నర సంవత్సరాల రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకున్నాడని అన్నారు. ప్రలోభాలకు లోనయ్యాడని ఆరోపించారు. అలాంటి వ్యక్తులు ఇచ్చే స్టేట్మెంట్లకు ఏం విలువ ఉంటుందన్నారు. రాజ్ కేసిరెడ్డికి బెవరేజస్ కార్పొరేషన్ కు ఏ సంబంధం అ న్నారు. టీడీపీ ఎంపీతో కలిసి ఆయన వ్యాపారాలు చేశారని అన్నారు. కృష్ణమోహన్, ధనుంజయ్, మిథున్ రెడ్డికి ఈ లిక్కర్ కేసుకి ఏం సంబంధం అన్నారు. తమ ప్రభుత్వం హయాంలో లాభాపేక్ష ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే మద్యం విక్రయాలను చేసిందన్నారు. కానీ చంద్రబాబు నాయుడు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో పెట్టి లిక్కర్ వ్యాపారం నడిపించారని అన్నారు. ఇప్పుడు బియ్యం డోర్ డెలివరీ చేయడం లేదు కానీ.. మందు డోర్ డెలివరీ చేస్తున్నారని అన్నారు. ఆ హయాంలో ఎమ్మార్పీకి మించి ఒక్క పైసా కూడా ఎక్కువ అమ్మలేదన్నారు. ఎవరి పాలసీ వల్ల లంచాలకు ఆస్కారం ఉంటుందో మీరే చెప్పాలి అన్నారు.

**ఏపీ లిక్కర్ స్కాం కేసుపై మాజీ సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనంగా మారిన లిక్కర్ స్కాం కేసుపై ఎట్టకేలకు మాజీ సీఎం జగన్ స్పందించారు. తాడేపల్లిలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ లిక్కర్ స్కాంపై మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ రాష్ట్రంలో అయిన లిక్కర్ అమ్మకాలు పెరిగితే లంచాలు ఇస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ అమ్మకాలు భారీగా తగ్గాయి. దీంతో మద్యం తయారీ సంస్థలు నష్టపోయాయి. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో అమ్మకాలు తగ్గి కంపెనీలు నష్టపోయినప్పుడు లంచాలు ఎందుకిస్తాయని ఈ సందర్భంగా జగన్ ప్రశ్నించారు. ఎక్కడైనా మద్యం విక్రయాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే భారీగా లంచాలు ఇస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో నేరుగా ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడిపితే లంచాలు ఎవరి నుంచి వస్తాయో చెప్పాలని ప్రశ్నించారు. తమ హయాంలో మద్యం విక్రయాలు సజావుగా సాగాయని.. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమే ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను కట్టబెట్టి కుంభకోణాలు చేస్తుందని, రాష్ట్రంలోని ప్రతి మద్యం షాపులో పర్మిట్ రూమ్‌ల ఏర్పాటు చేశారని, పేదలకు బియ్యం డోర్ డెలివరీ ఆపి లిక్కర్ డోర్ డెలివరీ చేస్తున్నారని, రాష్ట్రంలో ఎం ఆర్ పీ కన్నా ఎక్కువ రేట్లకు లిక్కర్ అమ్మకాలు చేస్తున్నారని మాజీ సీఎం జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

## టెక్కలిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ "మనఊరు- మాటామంతి" కార్యక్రమం



**టెక్కలి,మే 22 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెండి తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా "మన ఊరు - మాటా మంతి'' అనే పేరుతో ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమానికి ఈ రోజు శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని భవాని థియేటర్ నుంచి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వారి వారి కష్టాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి మార్గం చూపటమే ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వీరమహిళలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వైసీపీ నేతల కేసుల విచారణలు.. కోర్టు ఆదేశాలు ఇలా..!




**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ కు మరో షాక్ తగిలింది. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో వంశీను రెండు రోజులపాటు పోలీసు కస్టడీ నూజివీడు కోర్టు అనుమతించింది. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసుకు సంబంధించి వంశీకి ఈ నెల 29 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. వల్లభనేని వంశీ నుంచి నకిలీ ఇళ్ల పట్టాలకు ఇంకా సమాచారం రాబట్టేందుకు .. పోలీసుకస్టడీకి ఇవ్వాలని నూజివీడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన కోర్టు రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి నూజివీడు కోర్టు అనుమతించింది. ఏపీ లిక్కర్ కేసు లో సజ్జల శ్రీధర్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ ఈ 27 కు వాయిదా వేసింది ఏసీబీ కోర్టు.. ఇదే కేసులో మరో నిందితుడు పైలా దిలీప్ బెయిల్ పిటిషన్ ను ఈనెల 26కు వాయిదా వేసింది . ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి స్టేట్మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. గోవిందప్ప బాలాజీ ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ కేసులోనే మరో నిందితుడైన సజ్జల శ్రీధర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌ను ఈ నెల 27కు ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులుకు రిమాండ్ పొడిగించారు. ఏపీపీఎస్సీ కేసులో ఆయనకు జూన్ 5 వరకు రిమాండ్ పొడిగిస్తున్నట్టు విజయ వాడ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో, పీఎస్ఆర్ ను కాసేపట్లో విజయవాడ జైలుకు తరలించనున్నారు. పీఎస్సార్ ను కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ను కోర్టు మే 23కు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. నటిజత్వాని కేసు... ఏపీపీఎస్సీ అక్రమాల కేసుల్లో రిమాండ్ లో ఉన్న పీఎస్సార్ ఆంజనేయులు ఏపీ హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రెండు బెయిల్ పిటిషన్లను హైకోర్టు విచారణ చేపట్టనుంది.

## ఆ మంత్రులకు చంద్రబాబు క్లాస్.. రీజనేంటి ..!



**అమరావతి , మే 22 (వార్తాప్రభ) :** మంత్రివర్గంలోని కొందరికి మరో సారి సీఎం చంద్రబాబు క్లాస్ ఇచ్చారని తెలిసింది. రెండు రోజుల కిందట జరిగిన మంత్రి వర్గ సమావేశంలో అనగాని సత్యప్రసాద్, సుభాష్, కొండపల్లి రాం ప్రసాద్,కొల్లు రవీంద్ర, అనితల వంటి కొందరిని ప్రత్యేకంగా తన ఛాంబర్‌లోకి పిలిచి వారితో మాట్లాడినట్టు తాజాగా తెలిసింది. పనితీరుపై ఆయన సమీక్షించారని.. కొన్ని విషయాల్లో మంత్రుల వ్యవహార శైలిని తప్పుబట్టారని సమాచారం. ముఖ్యంగా నియోజకవర్గాల స్థాయిలో మంత్రుల పనితీరు బాగోలేదని చంద్రబాబు చెప్పినట్టు తెలిసింది. అందరినీ కలుపుకొని పోవడంలోనూ.. కూటమి నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడంలోనూ మంత్రులు వెనుకబడినట్టు సీఎం చంద్రబాబు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో తాను చేయించిన సర్వేల తాలూకు నివేదికలను కూడా ఆయన వారి ముందు పెట్టారని తెలిసింది. ఆయా నివేదికల ఆధారంగా మంత్రులను కొన్నిప్రశ్నలు కూడా అడిగినట్టు సీఎంవో వ్యవహారాలు చూసే కీలక నాయకుడు ఒకరు చెప్పుకొచ్చారు.

**'దీనిని క్లాస్ అని అనలేం కానీ..** సీఎం గట్టిగానే చెప్పారు. మంత్రుల పనితీరు మార్చుకోవాలని మాత్రం చెప్పారు. ఇది వాస్తవమే' అని సదరు నాయకుడు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు అనూహ్యంగా బుధవారం మీడియా ముందుకు వచ్చారు. జగన్ సహా వైసీపీ నాయకులపై విరుచుకుపడ్డారు. ఈ పరిణామంతో చంద్రబాబు క్లాస్ ఇచ్చారన్న వాదన బలంగా వినిపిస్తోంది. అనూహ్యంగా ఇంత మంది మంత్రులు మీడియా ముందుకు రావడం కూడా చర్చనీయాంశం అయింది.

**నిజానికి చంద్రబాబు..** ఇప్పటికే పలుమార్లు మంత్రులకు క్లాస్ ఇచ్చారు. ప్రజల్లో ఉండాలని.. పార్టీ కార్యక్రమాలకు హాజరు కావాలని కూడా చెప్పుకొచ్చారు. దీంతో అప్పట్లో కొందరు స్పందించారు. పార్టీ నాయకులతో కలివిడిగా ఉన్నారు. కానీ.. ఎప్పటికప్పుడు మంత్రులకు ఉన్న కార్యక్రమాల వల్ల కావొచ్చు.. లేదా, ఇతర కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కాలేక పోతున్నారు. దీనిపైనే చంద్రబాబు పలుమార్లు హెచ్చరించా రు. అయినప్పటికీ.. మార్పు కనిపించడం లేదన్నది చంద్రబాబు వాదన. ఈ క్రమంలోనే మంత్రులకు క్లాస్ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరి ఇప్పటికైనా మార్పు కనిపిస్తుందేమో చూడాలి.

# భవిష్యత్ విద్యుత్ వాహనాలదే!

- పర్యావరణహిత ఇంధన వినియోగం పెరగాలి
- వినియోగదారులకు ఫ్రెండ్లీగా డీజేటీ హైకా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు
- ఈవీ ఛార్జింగ్ సొల్యూషన్‌లను ప్రారంభించిన ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్.



**అమరావతి,మే 22 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో పరిశుభ్రమైన, పర్యావరణహిత ఇంధనాన్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. భవిష్యత్తు విద్యుత్ వాహనాలదేనని, వాటిని ప్రోత్సహించేందుకు సబ్సిడీలు, రాయితీలతోపాటుగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు. విజయవాడ క్లబ్‌లో గురువారం ప్రముఖ విద్యుత్ వాహనాల ఉత్పత్తుల తయారీ సంస్థ డీజేటీ హైకా ఆధ్వర్యంలోని అధునాతన ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను మంత్రి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశుభ్రమైన, స్థిరమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ఒక అద్భుతమైన అడుగు ఇది అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీజేటీ హైకా అభివృద్ధి చేసిన 60 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ మెషిన్, 240 కిలోవాట్ల డీసీ అల్ట్రా-ఫాస్ట్ ఛార్జింగ్ మెషిన్, 3.3 కిలోవాట్, 7.4 కిలోవాట్ ఏసీ ఛార్జర్‌లను రాష్ట్రంలో ప్రారంభించడం ఒక గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాలు(ఈవీ) శబ్ద, వాయు కాలుష్యాలను తగ్గించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడంలో గణనీయమైన పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. పర్యావరణ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో సమాజం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అందుకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఆధారిత వాహనాల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. మనం నివసించే పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవడమే కాకుండా, స్వచ్ఛమైన సాంకేతికత, పర్యావరణహిత ఇంధనాన్ని ప్రోత్సహించాలని మంత్రి శ్రీనివాస్ కోరారు. తద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు.

# ఈ పొత్తు ఎన్నాళ్లో...?

## - శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సంచలన వ్యాఖ్యలు



**కాకినాడ,మే 22 (వార్తాప్రభ) :** టీడీపీ సీనియర్ నాయకుడు, కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న పొత్తు ఎన్నాళ్లు ఉంటుందో..? అని అత్యంత కీలక వ్యాఖ్యలు సంధించారు. అంతేకాదు.. టీడీపీ ఆవిర్భావం తర్వాత.. అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుందని.. అనేక సార్లు బయటకు కూడా వచ్చిందని తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. తాజాగా గురువారం కాకినాడలో నిర్వహించిన మినీ మహానాడులో జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన మనసులోని ఆవేదనను వెళ్లగక్కారు. గత కొన్నాళ్లుగా తనకు ఏ పదవీ ఇవ్వడం లేదన్న అక్కసుతో ఉన్న జ్యోతుల.. గతంలో నిండు సభలోనే తనను ఉండే మంటే అసెంబ్లీలో ఉంటానని.. లేకపోతే వెళ్లిపోతానని వ్యాఖ్యానించారు. తనకంటే సీనియర్లు సభలో లేనేలేరని కూడా వ్యాఖ్యానించారు. ఇలా.. తనకు అవకాశం చిక్కినప్పుడల్లా పార్టీపై విమర్శలు చేస్తున్న ఆయన.. తాజాగా మినీ మహానాడు వేదికగా కూడా నోరు చేసుకున్నారు.

**ప్రభుత్వంలో పదవులు ఎవరికి దక్కుతున్నాయో..** అందరకి తెలుసునని వ్యాఖ్యానించారు. పార్టీ తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా.. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్వీర్యం అవుతోందని అన్నారు. " జిల్లాలో ఎవరికి పదవులు ఇచ్చారు? ఈవిషయం నేను చెప్పాల్సిన పనిలేదు. అందరికీ తెలుసు. కానీ.. ఇక్కడ కష్టపడింది మాత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలు. అయితే.. పదవులు మాత్రం వేరేవారికి ఇస్తున్నారు" అంటూ.. జనసేన నేత తుమ్మల బాబూజీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

**టీడీపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలన్నీ..** ఇబ్బందుల్లో పడ్డాయని మరో సంచలన వ్యాఖ్య చేశారు. అయితే.. ఇప్పుడు ఆ పరిస్థితి మన పార్టీ(టీడీపీ)కే వచ్చే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. పొత్తులో భాగంగా టీడీపీకి ఎక్కువ పదవులు రావాల్సి ఉందని.. కానీ, ఇవ్వడం లేదని.. దీనివల్ల ఇంట్లో ఆడవాళ్లకు కూడా సమాధానం చెప్పుకోవాల్సి వస్తోందని మరో తూటా పేల్చారు. ఇదిలావుంటే.. జ్యోతుల వైఖరిపై సొంత పార్టీలోనే విమర్శలు వస్తున్నాయి. మినీ మహానాడులో పార్టీ అభివృద్ధిపై చర్చించాలని అంటే..ఇలా విమర్శలు చేయడంపై నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

## రెండు అల్పపీడనాలు... తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వానలు



**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ), హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి వార్త అందించాయి. రానున్న కొద్ది రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని స్పష్టం చేశాయి. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలు, నైరుతి రుతుపవనాల కదలికలే ఈ వర్షాలకు ప్రధాన కారణమని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

## జీవ వైవిధ్య దినోత్సవం



**పాలకొల్లు,మే 22 (వార్తాప్రభ) :** జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలని కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం గ్రంథాలయ అధికారిణి వర్ధనపు శాంతకుమారి అధ్యక్షతన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొల్లాబత్తుల సూర్య కుమార్ సేకరించిన వివిధ దేశాల కరెన్సీలలోని జీవ వైవిధ్య అంశంనకు సంబంధించిన కరెన్సీ నోట్లను, నాణెములను, పోస్టల్ స్టాంపులను ప్రదర్శించారు. జీవ వైవిధ్య పరిరక్షణలో అందరూ పాల్గొనాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ రిసోర్స్ పర్సన్ కే.వీ.వీ. సత్య నారాయణ, గ్రంథాలయ పాఠకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 2047 నాటికి సర్క్యులర్ ఎకానమి 2 ట్రిలియన్ల కు చేరుకుంటుంది

- దేశంలోనే సర్క్యులర్ ఎకానమి ని మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలపాలి
- నేడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ మన రాష్ట్ర విధానం
- మరో ఆరు నెలల్లో సర్క్యులర్ ఎకానమి పై రూట్ మ్యాప్ సిద్ధం
- కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఛైర్మన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్.







**విజయవాడ, మే 22 (వార్తాప్రభ) :** 2047 నాటికి సర్క్యులర్ ఎకానమి 2 ట్రిలియన్ లకు చేరుకోవడం ఖాయమని, 2030 నాటికే రూ. 4వేల కోట్లకు పైగా ఆదాయం పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఇప్పటికే ఆచరణలో పెట్టామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జీరో వేస్ట్ పై సర్క్యులర్ ఏకానమి థీమ్ తో విజయవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ హెూటల్ లో రెండు రోజుల వర్క్ షాప్ ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ దేశంలోనే సర్క్యులర్ ఎకానమిలో మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిపటానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ స్థానంలో నేడు మన రాష్ట్రం స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానం లో దూసుకుపోతుందని అన్నారు. దేశంలోనే వేస్ట్ మేనేజ్ మెంట్ లో భాగంగా సర్క్యులర్ ఎకానమి పై ఒక విధానం రూపొందించిన మన రాష్ట్రం అన్ని రాష్ట్రాలకు ఆదర్శాంగా నిలిచిందన్నారు. రాబోయే ఆరు నెలల్లో రోడ్ మ్యాప్ సిద్ధం చేసి సర్క్యులర్ ఎకానమి ని అందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని హామి ఇచ్చారు. రీసైక్లింగ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుతో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. అందుకనే మన ముఖ్యమంత్రి జీరో వేస్ట్ పై దృష్టి సారించి అద్భుత ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారని వివరించారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే చెత్త నుండి సంపద సృష్టిస్తున్నామని తెలిపారు. ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. అనంత రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ తో అభివృద్ధి సాధిస్తాం అని విజన్ తో గుర్తించి ఉమ్మడి ఏపీలో బీజం నాటిన విధంగానే జీరో వేస్ట్ పై సర్క్యులర్ ఎకానమి పై ముందుగానే విజన్ తో అడుగులు వేశారని, అది ఇప్పుడు మొక్కై ఎదుగుతుందని, త్వరలోనే ఫలితాలు అందుకుంటామన్నారు. మన ప్రకృతి మనకు అందించిన ఖనిజ సంపద మనం తవ్వి వాడే కొద్ది ఒక దశ దాటిన తరువాత తరిగిపోతుందని, కాని ఆ ఖనిజ వేస్ట్ ను రీసైక్లింగ్ చేసే ఆలోచనే సర్క్యులర్ ఎకానమి అని వివరించారు. రీసైక్లింగ్ కు సంబంధించిన నిబంధనలు గతంలోనే ఉన్నాయని, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించామని, నేడు వాటి అమలుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ నిబంధనలు అభివృద్ధి సాధించడానికే కాని ఇబ్బందులు పెట్టడానికి కాదన్నారు. రీసైక్లింగ్ ను సక్రమంగా వినియోగిస్తే వ్యర్థాల నుండి సంపద సృష్టి జరుగుతుందన్నారు. ఏపీపీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో వ్యర్థాలను పునర్ వినియోగం లోనికి తీసుకవచ్చి ఆర్థికరంగాన్ని పరిపుష్టం చేసేందుకు , పర్యావరణ పరిరక్షణకు , ఉపాధి కల్పనకు రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించి అందరి సూచనలు, సలహాలను, కార్యాచరణ రూపొందించి నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. సర్క్యులర్ ఎకనమీ ద్వారా కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు ఈ జాతీయ స్థాయి వర్క్ షాప్ దోహదపడుతుందన్నరు. వర్క్ షాపుకు దేశంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన పారిశ్రామిక వేత్తలు, శాస్త్రవేత్తలు, బ్యాంకర్లు హాజరవడం హర్షనీయమన్నారు. పరిశ్రమలలో వ్యర్థాలు రాకుండా చేయడం ఒక ఎత్తు అయితే ఆ వ్యర్థాలను పునర్ వినియోగం చేయడం మరొక ఎత్తు అని అన్నారు. సర్క్యులర్ ఎకానమి పై ఏపీ ప్రభుత్వం ఒక పాలసీ తీసుకరానుందన్నారు. ఎలక్ట్రానిక్, బ్యాటరీలు, పాత వాహనాలను రీ సైక్లింగ్ చేసే సమగ్ర ప్రణాళిక ప్రస్తుతం మన రాష్ట్రం లో అందుబాటులో లేదని, అలాగే వ్యర్థాలు ఎంత ఉత్పత్తి అవుతున్నాయి అన్న అంచనా కూడా లేదన్నారు. మన రాష్ట్రంలో వ్యవసాయ వ్యర్థాలతో కంప్రెసర్ బయోగ్యాస్ తయారు చేందుకు రూ. 500 కోట్ల రూపాయలతో రిలయన్స్ కంపెనీ ఇప్పటికే ప్లాంట్ లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ శరవణన్, గౌతమ్ మెహ్రా, బీఎస్ఎస్ ప్రసాద్, ఏపీఈఎంసీ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, వరలక్ష్మి, సంజయ్ మెహతా, మెటిరీయల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, స్టాక్ హెూల్డర్స్, పరిశోధన సంస్థల ప్రతినిధులు, వేస్ట్ రీసైక్లర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయ అధికారులు , జోనల్ మరియు రీజనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లండన్ లో తొలి భారతీయ డిప్యూటీ మేయర్ ఉదయ్ ఆరేటికి శుభాకాంక్షలు..

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.



**అవనిగడ్డ,మే 22 (వార్తాప్రభ) :** లండన్ (యూకే)లోని రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్ టన్ మరియు చెల్సియా డిప్యూటీ మేయరుగా బాధ్యతలు స్వీకరించిన తొలి భారతీయుడు "ఆరియన్ ఉదయ్ ఆరేటి"కి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఆరియన్ ఉదయ్ 2018లో సెంట్రల్ లండన్ కెన్సింగ్ టన్ మరియు చెల్సియాకు మొదటి భారతీయ కౌన్సిలర్ (ఎమ్మెల్యేకు సమానమైన పదవి) గౌరవం పొందారని తెలిపారు. భారతదేశం నుంచి యూకే వెళ్లి అనేక సవాళ్లు ఎదుర్కొని ధృఢ సంకల్పం, స్పష్టమైన ధృక్పధంతో రాజకీయంగా ఎదుగుతున్న ఆరియన్ ఉదయ్ కు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శుభాభినందనలు తెలిపారు.

# ఘనంగా టీడీపీ కాకినాడ జిల్లా మహానాడు

- ఆకట్టుకున్న పలువురి ప్రసంగాలు
- కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించాలి
- 10 లక్షల కోట్ల అప్పుకి వడ్డీలు కడుతున్నాం



**కాకినాడ,మే 22 (వార్తాప్రభ) :** టీడీపీ నిర్వహించిన కాకినాడ జిల్లా మహానాడు – 2025 విజయవంతం అయింది. ఈ మహానాడులో పలువురు నాయకులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. గురువారం కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో నిర్వహించిన కాకినాడ జిల్లా టీడీపీ – 2025 మహానాడును ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పౌరులకు ఘన నివాళి అర్పించారు. అలాగే టీడీపీ జెండా మోసి అశువులు బాసిన కార్యకర్తలకు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు కొంత సేపు మౌనం పాటించారు. మహానాడు కార్యక్రమానికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యేలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వరుపుల సత్యప్రభ, వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), నిమ్మకాయలు చినరాజప్పలతోపాటు ఇన్చార్జిలు, ప్రముఖులుగా వ్యవహరిస్తున్న వారు ఆయా నియోజవర్గంలలో ఉన్న సమస్యలను లేవనెత్తారు. వారిలో ముఖ్యంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేసిన ప్రసంగం కార్యకర్తలను ఆకట్టుకుంది. రాజకీయం తీర్మానంపై మాట్లాడారు. కార్యకర్తలకు ప్రజలు నుండి దోచుకోకుండా వారికి ఆర్థిక స్థితి కల్పించి ఆదుకోవాలన్నారు. అలాగే కాకినాడ జిల్లాలో తెలుగుదేశం పరిస్థితి బాగోలేదని పదవులు ఒకే పార్టీకి కట్టబెట్టడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మిత్రధర్మం పాటిస్తూనే టీడీపీ కార్యకర్తలకు నిష్పత్తిగా న్యాయం చేయాలని నెహ్రూ సూచించారు. కాకినాడ జిల్లాలో గతంలో జిల్లాలో 21 మంది ఎమ్మెల్యేలు ఉండేవారని తామంతా సమిష్టి నిర్ణయాలను తీసుకొని రాష్ట్రస్థాయిలో తెలియజేసే వారన్నారు. అందుకు దానికి ప్రతిస్పందన వచ్చి జిల్లా అభివృద్ధికి బాసటగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఉన్న కాకినాడ జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కొరవడిందని జిల్లాపై అభివృద్ధి నిమిత్తం కూర్చొని చర్చించుకున్న సంఘటన లేదన్నారు. కాకినాడలో సెజ్కు 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారని అందులో ఎటువంటి పరిశ్రమలు రాకపోవడంతో యువత, నిరుద్యోగులు నిరాశలో ఉన్నారన్నారు. కడపలో నిర్వహించే రాష్ట్ర మహానాడు తర్వాత అయినా తామంతా జిల్లా అభివృద్ధిపై సమీక్షించేందుకు నిర్ణయం తీసుకుంటామన్నారు. గతంలో సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు సమస్య వస్తే తమ అభిప్రాయాలు తెలుసుకొని చర్చించేవారని ఇప్పుడు అవకాశం లేకపోవడం పట్ల జిల్లాలో జిల్లా అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించి వారి ఎదుగుదలకు ప్రోత్సహించాలని నెహ్రూ అభిలాషించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను గత సీఎం జగన్ తన అవివేకతనంతో నాశనం చేసి రాష్ట్రాన్ని అధోగది పాలు చేశారన్నారు. 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారన్నారు. వాటికి ప్రజల నుంచి వచ్చిన పన్నులను వడ్డీలుగా చెల్లిస్తున్నామన్నారు. దేశంలో అందరికంటే ఎక్కువగా 32 వేల కోట్లు రూపాయలు పింఛన్లకు ఇస్తున్నామని వచ్చే నెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెస్ఎంఇ పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించుతున్నట్లు చెప్పారు. 2047కి దేశంలో మన రాష్ట్రం అభివృద్ధిలోఅగ్రభాగంలో నిలిపేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారన్నారు. తెలుగుదేశం కార్యకర్తను గౌరవించి వారి ఉన్నతికి ప్రోత్సహించే పార్టీగా అభివర్ణించారు. గత సీఎం జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేశారని ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితిని చంద్రబాబు చక్కబెడుతున్నారని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నాయకులు చిక్కాల రామచంద్రరావు, ఎస్వీఎస్ఎన్ వర్మ, పిల్లి సత్తిబాబు, వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి బాబి, మహాసేన రాజేష్, తోట నవీన్, సుర్ల లోవరాజు, తుమ్మల సునీత, వేటుకూరి నాగమణి, వనమాడి మోహన్ వర్మ, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహన్రావు, పెంకే శ్రీనివాస్ బాబా, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్టీఆర్తో కలిసి పని చేసిన సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్రరావు, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూలను ఘనంగా సన్మానించారు.

## హనుమజ్జయంతి సందర్బంగా 500 లీటర్ల మజ్జిగ పంపిణీ



**హనుమాన్ జంక్షన్,మే 22 (వార్తాప్రభ) :** హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా భక్తులకు పాదచారులకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధక్షులు డా. యనమదల రమేష్ ఆధ్వర్యంలో 500 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ గ్లోబల్ ప్రసిడెంట్ తాడి రంగారావు ప్రారంభించారు. భక్తుల దాహర్తి ని తీర్చేదుకు మజ్జిగ పంపిణీ చేపట్టిన రమేష్ అభినంద నీయుడని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ యనమదల శ్రీనివాసరావు, కంటిపూడి పుల్లయ్య చౌదరి, కటకం నాగేశ్వరావు, దమ్మాలపాటి హరిబాబు, యనమదల వేణు గోపాల్, గుళ్ళపల్లి దుర్గారావు, తదితరులు పాల్గున్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణాలతో పోటెత్తిన ఆలయాలు





**విస్సన్నపేట,మే 22 (వార్తాప్రభ) :** శ్రీ విశ్వవసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖమాసం దశమి గురువారం హనుమత్ జయంతి సందర్భంగా వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్లో కోదండ రామాంజనేయ ఆలయం, శివాలయం సెంటర్లో శ్రీ శంకు చక్ర సహిత దాసాంజనేయ స్వామి వారి ఆలయం తాత కుంట్ల రామాలయం నరసాపురం శ్రీ సూర్య లక్ష్మీనారాయణ దేవాలయం కలగర గ్రామంలో 200 సంవత్సరాల నాటి హనుమాన్ ఆలయం రామచంద్రపురం గిరిజన తండాలో గిరిజన కుటుంబాలు మహాబలి హనుమాన్ కు పూజల నిర్వహించారు. హిందూ పురాణాల ప్రకారం శ్రీరాముని భక్తుడు ఆంజనేయుడిని ఆరాధించిన వారికి సకల పాపాలు తొలగిపోయి విముక్తి లభిస్తుందని వేద పండితులు తెలియజేస్తున్నారు. అంతేకాకుండా భయం తొలగిపోయి బలం ధైర్యం పెరుగుతుందని చాలామంది నమ్ముతారు తెలుగు క్యాలెండర్ ప్రకారం మే 22వ తేదీన గురువారం దేశవ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు జరుపుకుంటున్నామని హనుమాన్ చాలీసా పారాయణం చేయు ప్రదేశాలలో అంజనీపుత్రుడైన హనుమంతుడు భక్తిపార్వస్యంతో అక్కడే ఉండటం జరుగుతోందని పురాణాలు ఇతిహాసాలలో చెప్పడం జరుగుతోంది. కొన్ని ప్రాంతాలలో ఆంజనేయ స్వామివారిని భక్తులు సాయం సమయంలో ఊరేగింపు సంబరాలు జరుపుకోవడం జరుగుతుందన్నారు. మండలంలో గ్రామ గ్రామాన అన్న ప్రసాద వితరణ తీర్థప్రసాదాలు పంపిణీ జరిగింది.

## లండన్ డిప్యూటీ మేయర్ గా భీమవరం వాసి..



**కృత్తివెన్ను,మే 22 (వార్తాప్రభ) :** భీమవరం మండలం తుందూర్రు గ్రామానికి చెందిన ఆరేటి ఉదయ్ లండన్ సెంట్రల్ డిప్యూటీ మేయర్ గా ఎన్నికయ్యారు. అయినా గురువారం రాత్రి 11 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేసిన కృత్తివెన్ను మండలం పల్లెపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొప్పినీడి సూర్యప్రకాష్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం కే జి ఆర్ ఎల్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, తన గురువైన ఆరేటి సత్యనారాయణ వారి కుమారుడు ఉదయ్ తనకు మంచి మిత్రుడు అని , బ్రిటిష్ గడ్డపై డిప్యూటీ మేయర్ గా ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. ఉదయ్ మరెన్నో ఉన్నత శిఖరాలకు ఎదిగి మాతృదేశానికి, మంచి పేరు ప్రతిష్టలను తీసుకు రావాలని ఆకాంక్షించారు...

## అడ్డపర్ర ఆంజనేయస్వామి ని దర్శించుకున్న ఎమ్మెల్యే కాగిత....



**కృత్తివెన్ను,మే 22 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండల పరిధిలోని అడ్డపర్ర గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామిని గురువారం హనుమన్ జయంతి సందర్భంగా పెడన నియోజవర్గ శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాద్ దర్శనం చేసుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కాగిత కృష్ణప్ర సాద్ కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ హనుమాన్ జయంతి రోజున స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండడానికి స్వామివారి ఆశీస్సులు మెండుగా కావాలని ఆకాంక్షించారు .ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**హనుమాన్ జంక్షన్,మే 22 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి వెయ్యి మందికి అన్న సమాధానం నిర్వహించడం జరిగింది. ఈ పూజలలో కృష్ణ వరకు గోపయ్య, కోబోడేయినబాబి, రాయి రాట్నాలు, రాయి రాఘవేంద్రరావు, కృష్ణవరపు నాగరాజు, కిష్టవరపు సాయి, షణ్ముఖ, కృష్ణ వరపు జగదీష్ తదితర భక్తులు పాల్గొన్నారు.

## 25 రూ.లకే రైలులో దేశం మొత్తం చుట్టెయొచ్చు.. యువతకు మాత్రమే!

**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** భారతదేశం భిన్న సంస్కృతులకు.. ప్రకృతి అందాలకు.. చారిత్రక ప్రదేశాలకు.. ఆధ్యాత్మిక ప్రాంతాలకు నెలవు. అలాంటి దేశాన్ని చుట్టేయాలనే కోరిక ఎవరికి ఉండదు?. అలాంటి వారి కోసం "జాగృతి యాత్ర" పేరుతో ప్రత్యేక రైలును కేంద్రం తీసుకువచ్చింది. 2008 నుంచి ఈ రైలు నడుస్తోంది. కానీ ఈ రైలు గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఈ రైలు ప్రధాన ఉద్దేశ్యం వ్యాపారం ద్వారా భారతదేశ నిర్మాణం. ఈ రైలులో ప్రయాణించడం ద్వారా యువత పారిశ్రామికవేత్తలుగా మారడానికి అవసరమైన నైపుణ్యాలు.. అలాగే స్ఫూర్తిని పొందవచ్చు. ఈ రైలు ప్రయాణంతో పాటు జ్ఞానాన్ని సైతం పెంచుకోవచ్చు. అయితే ఈ రైలులో ఎలా ప్రయాణించాలి.. టికెట్ బుకింగ్ ఎలా చేసుకోవాలి.. ఎంత ఖర్చవుతుందంటే..

**ఏడాదికి ఒక్కసారి మాత్రమే..** ఈ రైలు ఏడాదికి ఒక్కసారి మాత్రమే నడుస్తుంది. ఈ రైలు ప్రయాణానికి 500 మంది ప్రయాణికులను మాత్రమే అనుమతిస్తారు. ఇక ఈ రైలు ప్రయాణంలో యువతకు పారిశ్రామికవేత్తలకు సంబంధించిన మెళకువలు నేర్పిస్తారు.కేవలం 15 రోజుల్లో ఈ రైలు సుమారు 8000 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.

**ఢిల్లీ నుండి ప్రారంభం..** ఈ రైలు ఢిల్లీ నుండి ప్రారంభమవుతుంది. మొదటి స్టాప్ అహ్మదాబాద్.. ఆ తర్వాత ముంబై, బెంగళూరు మీదుగా మధురై చేరుకుంటుంది. అక్కడి నుండి ఒడిశాలోకి ప్రవేశించి.. మధ్య భారతదేశం ద్వారా తిరిగి ఢిల్లీకి చేరుకుంటుంది. ఈ రైలు ప్రయాణంలో అనేక తీర్థయాత్రా స్థలాలతోపాటు పర్యాటక ప్రదేశాలను సైతం సందర్శించే అవకాశం కల్పిస్తారు.

**ఈ ఏడాది.. ఈ యాత్ర ఎప్పుడు? ఎలా నమోదు చేసుకోవాలి?..** ఈ యాత్ర ప్రతి ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమవుతుంది. అయితే అందుకోసం ముందుగానే పేరు నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలి. ఈ రైలులో ప్రయాణించడానికి వయస్సు 21 నుండి 27 సంవత్సరాల మధ్య మాత్రమే ఉండాలి. ఈ ఏడాది ఈ యాత్ర నవంబర్ 7వ తేదీన ప్రారంభమై.. నవంబర్ 22వ తేదీతో ముగుస్తుంది.

**ఇలా బుక్ చేసుకోవాలి..** సీటును బుక్ చేసుకోవడానికి https://www.jagritiyatra.com అనే వెబ్సైట్ను సందర్శించి పేరు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ రైలులో ప్రయాణించడానికి యువతను మల్టీ-లెవల్ సెలక్షన్ ప్రాసెస్ తర్వాతే ఎంపిక చేస్తారు. ఈ యాత్ర కోసం అక్టోబర్ 15వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చు. మీరు ఈ యాత్రకు సంబంధించిన నిబంధనలకు అర్హులు అయితే.. కేవలం రూ.25 మాత్రమే టికెట్ ధర చెల్లించాల్సి ఉంటుంది. అంటే జస్ట్ రూ.25తో భారతదేశం మొత్తం చుట్టేయవచ్చు!

## హత్యకేసు..జీవితఖైదు




**పెనుగంచిప్రోలు, మే 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో 2016 సంవత్సరం లో కుటుంబ కలహాలతో జడుగు రాణి ని భార్త వెంకటనారాయణ హత్య చేసి రోడ్డు ప్రమాదం గా చిత్రికరిం చాడు.దీనిని ఆమె బంధువులు హత్య చేసి ఇలా రోడ్డు ప్రమాదం అంటున్నాడని పోలీసులకు తెలపగా అప్పటి జగ్గయ్యపేట సిఐ లక్ష్మి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చెప్పటాడు.కేసు పూర్తి వివరాలు తో కోర్టు కు సమర్పించారు. పోలీసువారు గురువారం నందిగామ కోర్టు లో రాణి భర్త వెంకటనారాయణ కు జీవిత ఖైదు, రూ.. 5 వేలు జరిమానా విధించినట్లు ప్రస్తుత సి ఐ. వెంకటేశ్వర రావు తెలిపారు. వెంకటనారాయణ నేరం రుజువు కావడం తో ఈ శిక్ష పడిందినీ సి ఐ అన్నారు.

# సేంద్రియ ఎరువులు ముద్దురసాయన ఎరువులు వద్దు

**- డా. వి. లక్ష్మి నారాయణమ్మ**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,రాబోవు వానాకాలానికి రైతులను సన్నద్ధం చేసే దిశగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు " అవగా హనా కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం గురువారం సుజాతనగర్ మండలంలోని పాత అంజనా పురంలో పర్యటించారు ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వి. లక్ష్మి నారాయణమ్మ మాట్లాడుతూ పంట పొలాల్లో తక్కువ యూరియాను వాడాలని, అవసరం మేరకు రసాయనిక ఎరువులు వాడుకుంటూ సాగు ఖర్చును తగ్గించి భూమాత ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. జిల్లాలో కురుస్తున్న తొలకరి వర్షాలను ఉపయోగించుకొని రైతులు పంటకాలంలో వచ్చే పురుగులు, తెగుళ్ళ ఉధృతిని తగ్గించు కోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త . శివ, వ్యవసాయ అధికారిణి నర్మద, ఉద్యాన అధికారిణి స్రవంతి, విస్తరణ అధికారి నరసింహారావు, వ్యవసాయ కళాశాల, అశ్వారావుపే(ట విద్యార్థులు మరియు 108 మంది రైతులు పాల్గొన్నారు

# నంబాల కేశవరావు, నవీన్ ఎన్కౌంటర్లపై విచారణ జరిపించాలి.

**ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి**



**జవహర్ నగర్, మే,22:(వార్తా ప్రభ)**సిపిఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు, జంగ్ పత్రిక సంపాదకులు నవీన్ తో పాటు మరో 25 మంది చత్తీస్ ఘడ్, నారాయణ పూర్, అబూజ్ మడ్ ఎన్కౌంటర్లో హతమైనట్లు జరుగుతున్న ప్రచారంలో దేశంలోని మేధావులు, హక్కుల నేతలు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్న క్రమంలో ముమ్మాటికీ ఇవి భూటకపు ఎన్కౌంటర్లతో జరిగిన రాజకీయ హత్యలేనని ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి స్పష్టం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నంబాల కేశవరావు మృతిపై దేశ ప్రధాని నరేంద్రమోడీ మావోయిస్టులపై సాదించిన అతిపెద్ద విజయంగా కీర్తించడాన్ని ఖండించారు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులకు, మధ్యభారత దేశంలో గత 16 నెలలుగా వందలాదిమంది ఆదివాసులను పొట్టన పెట్టుకున్న వారికి తేడా ఏమిటో? దేశాన్ని ఏలుతున్న పాలకులకే తెలియాలని అన్నారు. ఈదేశ పౌరులైన ఆదివాసులను పరాయి దేశ దురాక్రమణ దారులపై జరుపుతున్నట్లు వరుస దాడులతో జీవించే హక్కును కాలరాయడం అప్రజాస్వామికం. అమానుషం అన్నారు. అటవీ, ఆదివాసి హక్కుల రక్షణ కొరకు పోరాడుతున్న మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని పలుమార్లు ప్రకటించినప్పటికి, ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ వైపే మొగ్గుచూపడాన్ని దేశంలోని ఇంకా నోరు విప్పని మేధావులు, బుద్ధిజీవులు, రాజకీయ పార్టీలు, హక్కుల నేతలు, అభ్యదయ, భారత రాజ్యాంగ పరిరక్షణ అంబేద్కరిస్టులు వెంటనే స్పందించి, ఖండించాలని కోరారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేసి, శాంతి చర్చలకు డిమాండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మధ్య భారతదేశ ఆదివాసి ప్రజల మనుగడనను, అడవిలోని జీవరాశులను, పర్యావరణాన్ని దెబ్బతీసే కుట్రపూరితమైన చర్యలను సంఘటితంగా ఎదుర్కనవలసిన అవసరం నేడు సామాజిక బాధ్యత కలిగిన ప్రతిపౌరుడిపై ఉన్నదని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించండి.

**మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కు వినతి పత్రం సమర్పణ**



**కుత్బుల్లాపూర్ మే 22 (వార్తాప్రభ)** : కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ శాసన సభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టిఏ మెంబర్ తుంకుంట మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డివర్మ గొప్ప సంఘ సంస్కర్త!!

- విద్యను ఆయుధంగా మలిచిన మహనీయులు
- నేటి తరానికి గొప్ప మార్గదర్శి
- రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 22 (వార్తాప్రభ ప్రతినిధి)** దేశంలోనే గొప్ప సంఘ సంస్కర్త మాదరి భాగ్యరెడ్డి వర్మ అని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. కమిషనరేట్ సమావేశం మందిరంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.....భాగ్యరెడ్డి వర్మ సంఘ సంస్కరణల కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. ఆంధ్రసభ స్థాపకుడిగా హైదరాబాద్లో దళిత పాఠశాలను ప్రారంభించి, దళిత అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారన్నారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించి సమాజంలో అసమానతలను తొలగించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని అన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఎన్నో విద్యాసంస్థలు స్థాపంచి అందరూ చదువుకునేలా ప్రోత్సాహించారని పేర్కొన్నారు. విద్యను ఆయుధంగా మలిచి సమాజ అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

- సీఎం కు ఘనంగా స్వాగతం పలుకుదాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ





**జహీరాబాద్, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈనెల 23 న సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి అయినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కార్ , జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, శాసనసభ్యులు సంజీవరెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొనే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. హెలిపాడ్ ను,సీఎం చేతుల మీదుగా ప్రారంభించే బసవేశ్వర విగ్రహం, నిమ్జ్ రోడ్, కేంద్రీయ విద్యాలయ భవనం, సభ స్థలంను మంత్రి దామోదర్ రాజనర్సింహ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హెలిప్యాడ్ పనులు, ప్రజా వేదిక సభ వేదిక, వి ఐ పి గ్యాలరీ, మీడియా గ్యాలరీ ,వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, గ్రీనరీ, స్టేజి ఏర్పాట్లు, స్టేజి అలంకరణ, పరిశు భ్రత, మిషన్ భగీరథ త్రాగునీరు, టాయిలెట్స్ అన్ని పనులు పూర్తి అయ్యాయన్నారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎస్పీ పంకజ్ పరితోష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు,జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీరామచంద్రుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న భాగ్య శాలి హనుమంతుడు.

- శాసనసభ్యులు అరిక పూడి గాంధీ



**శేరిలింగంపల్లి,మే 22 (వార్తాప్రభ)**:హనుమాన్ జయంతి పర్వదినంను పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ విలేజ్ లో గల శ్రీ హనుమాన్ దేవాలయంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని,ఎక్కడ శ్రీరాముడు కొలువై ఉంటాడో,ఎక్కడ శ్రీరామ నామం వినిపిస్తుందో..అక్కడ హనుమంతుడు ఉంటాడు. ఆయనను మించిన భక్తుడు లేడంటూ శ్రీ రామచంద్రుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న భాగ్యశాలి హనుమంతుడు అని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా రామాయణానికి ఓ నిండుదనాన్ని తీసుకు వచ్చాడు. సుగ్రీవుడిలో కదలిక తీసుకు వచ్చి అతని సైన్యాన్ని ముందుకు నడిపించడంలోనూ ... లంకలో ఉన్న సీతమ్మవారి ఆచూకీ తెలుసుకోవడంలోను ... వారధి నిర్మించడంలోను ... యుద్ధరంగాన లక్ష్మణుడు మూర్చ పోయినప్పుడు 'సంజీవిని' పర్వతాన్ని పెకిలించి తీసుకు రావడంలోను హనుమంతుడు కీలకమైన పాత్రను పోషించాడు. అందుకే హనుమంతుడులేని రామాయణాన్ని అస్సలు ఊహించలేం అని,హనుమంతుడి గుడి లేని ఊరు లేదు అని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,ఓం ప్రకాష్ గౌడ్,కృష్ణ పటేల్ గౌడ్,నాగేశ్వర్ గౌడ్,అశోక్,వెంకటేష్ గౌడ్,రవి గౌడ్, కృష్ణ గౌడ్,వీరేందర్,ప్రవీణ్, మహేందర్ ముదిరాజ్,శ్రీనివాస్ ముదిరాజ్,శివ ముదిరాజ్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి బజారు లో సింగరేణి సేవా సమితి స్టాల్ ను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు



**సేవా సమితి ఉత్పత్తులపై ప్రశంసలు**



**శేరిలింగంపల్లి, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో గురువారం హైదరాబాద్ లోని శిల్పారామాన్ని సందర్శించిన అనంతరం ప్రపంచ సుందరీమణులు పక్కనే ఉన్న ఇందిరా మహిళా శక్తి బజారును సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి సేవా సమితి స్వయం ఉత్పత్తిదారుల వస్తు విక్రయశాలను కూడా వారు సందర్శించారు. వివిధ ఏరియాల నుండి సింగరేణి సేవా సమితిలో శిక్షణ పొందిన మహిళలు తయారుచేసి విక్రయశాలలో ఉంచిన బ్యాగులు, చేతి పర్సులు, మగ్గం వర్క్ చేసిన దుస్తులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విక్రయశాలలో ఉన్న స్వయం ఉత్పత్తి యూనిట్ల మహిళలతో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. వివిధ ఉత్పత్తుల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు చక్కగా ఉన్నాయి అంటూ ప్రశంసలు కురిపించారు. ప్రపంచ స్థాయి సుందరీమణుల నుంచి ప్రశంసలు అందుకోవడం మాకు గర్వకారణమని సమితి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించిన సింగరేణి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి స్టాల్ ఏర్పాటుకు అవకాశం కల్పించిన సీఎండీ ఎన్.బలరామ్ కు స్టాల్ లో ఉన్న సేవా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మారుమూల ప్రాంతంలో ఉన్న తమకు హైదరాబాద్లో స్టాల్ తో పాటు వసతి , రవాణా సదుపాయాన్ని కల్పించడమే కాకుండా ప్రపంచ సుందరీ మణుల ను ఇక్కడకు తీసుకొచ్చి తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించిన సెర్ఫ్ సీఈవో దివ్యా దేవరాజన్ కు ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు



**కుత్బుల్లాపూర్ మే 22 (వార్తాప్రభ)** : శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ హనుమాన్ భక్త మండలి వారి ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్ సతీ సమేతంగా విచ్చేసి శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ...శ్రీ ఆంజనేయస్వామి భక్తులందరికీ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని,అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలను కలిగించాలని ఆ స్వామివారిని వేడుకున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి కార్యవర్గ సభ్యులు, కుత్బుల్లాపూర్ గ్రామవాసులు తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# వసతుల విన్నపం!!

**ఆసుపత్రిలో స్పెషలిస్ట్ డాక్టర్లు అవసరం సింగరేణి సిఎండికి ఎమ్మెల్యే రిక్వెస్ట్**



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 22 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వివిధ రకాల వసతుల ఏర్పాట్లు కోరుతూ గురువారం నాడు సింగరేణి సిఎండి బలరాం నాయక్ కి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి పత్రాన్ని తన కార్యాలయంలో అందజేశారు. ఆసుపత్రిలో స్పెషలిస్ట్ డాక్టర్లు అవసరం అని పేర్కొంటూ రిక్వెస్ట్ లెటర్ అందజేసినట్లు ప్రకటనలో వివరాలను వెల్లడించారు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం. న్యూరో ఫిజీషియన్, పిల్లల వైద్య నిపుణులు, కంటి వైద్యనిపుణులు, ఈఎన్టీ స్పెషలిస్ట్, రేడియాలజిస్ట్ అలాగే 2డీ ఎకో, టిఎంటి టెక్నీషియన్ డయాలసిస్ యూనిట్ విస్తరించాలని కోరారు.

# ఎవరెస్ట్ ఎత్తులో విహెచ్ఆర్ సేవలు!!

- నిజాయితీ, నిస్వార్థం రెండు కళ్ళుగా కార్యక్రమాలు
- నిరుపేద యువతీ వివాహానికి ఆర్థిక సహాయం
- రామగుండం ఆడబిడ్డలకు దేవుడిచ్చిన అన్న హరీష్ రెడ్డి
- బిఆర్ఎస్ మహిళా నేత ఎండి తస్నీం భాను



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 22 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎవరెస్ట్ ఎత్తులో విహెచ్ఆర్ సేవలు విస్తరింప చేస్తున్నారు సంస్థ చైర్మన్ అండ్ డైరెక్టర్ వ్యాల్ల హరీష్ రెడ్డి. రామగుండం నియోజకవర్గంలోని ఆడబిడ్డలకు దేవుడిచ్చిన అన్న హరీష్ రెడ్డి అని బీఆర్ఎస్ మహిళా నేత ఎండి తస్నీం భాను ప్రశంసించారు. ఈ మేరకు గురువారం ఎనిమిదవ డివిజన్ పరిధిలోని తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద యువతి తహేరా వివాహానికి ఆర్థిక సహాయం అందించారు వీహెచ్ఆర్ బాధ్యులు. ఈ సందర్భంగా పలువురు వ్యాల్ల హరీష్ రెడ్డి సేవలను కొనియాడుతూ మాట్లాడారు. నిజాయితీ, నిస్వార్థం రెండు కళ్ళుగా వేలాది కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలను అక్కున చేర్చుకుంటూ ఆపన్న హస్తం అందిస్తున్న గొప్ప మానవతావాదులు, గొప్ప సంఘసంస్కర్త విహెచ్ఆర్ చైర్మన్ హరీష్ రెడ్డి అని ప్రశంసించారు. ఎప్పుడు ఎక్కడ ఎలాంటి కష్టం వచ్చినా నేను ఉన్నానంటూ చేయూత అందిస్తున్న హరీష్ రెడ్డి ఆయురారోగ్యాలతో కృతజ్ఞతలు తెలియజేశారు.

# టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లు అందజేత



**భద్రాద్రి కొత్తగూడెం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో టిబి వ్యాధిగ్రస్తులకు గ్రాన్యూల్స్ ఇండియా ఫార్మాస్యూటికల్ కంపెనీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్స్ అందించారు బియ్యము పప్పు పల్లీలు రాగి పిండి మంచి నూనె ఉండే ప్యాకెట్లను 6 బాక్సులుగా తయారు చేసి ఇచ్చామని టీబి వ్యాధిగ్రస్తులకు బలమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు టీబీ మందులు వాడుతున్న వారికి ఆరు నెలలకు సరిపడా ఒక్కొక్కరికి ఆరు కిట్ల చొప్పున పంపిణీ చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో టీ బి సూపర్వైజర్ మరియు హెచ్ఈఓ హెచ్.వీలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

### వినాయక్ నగర్ లో "స్వచ్ఛ్ నమస్కార్" కార్యక్రమం



**కుత్బుల్లాపూర్ మే 22 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 132 డివిజన్ వినాయక్ నగర్ లో "స్వచ్ఛ్ నమస్కార్" లో భాగంగా రోడ్డు పక్కన చెత్త, యుజిడి లైన్ శుభ్రపరిచే కార్యక్రమం గురువారం 132 డివిజన్ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు నదీమ్ రాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏ శివ కుమార్, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి నవీన్ లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎడిటోరియల్

## బీజేపీతో పొత్తుకు వైసీపీ సిద్ధమా ?

ఏపీలో టీడీపీ కూటమి బలంగా ఉంది. ఎంత బలంగా అంటే మరో నాలుగేళ్ల తరువాత ఏపీలో జరిగే ఎన్నికల్లో పొత్తులతోనే పోటీ చేయాలని ఇప్పటి నుంచే ఒట్టు పెట్టుకుని ముదుకు సాగేటంత బలంగా ఉంది. ఇదిలా ఉంటే టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇద్దరూ కేంద్రంలోని బీజేపీ పెద్దలతో ఎంతో సాన్నిహిత్యంగా ఉంటున్నారు. బాబు సైతం 2014 నుంచి 2019 మధ్యలో జరిగిన అనుభవాలతో బీజేపీ పెద్దల మనసెరిగి నడచుకుంటున్నారు అని చెబుతున్నారు. ఈ నేపధ్యంలో ఇపుడు ఏపీలో కొత్త చర్చ స్టార్ట్ అయింది. దానిని స్టార్ట్ చేసిన వారు వైసీపీకి చెందిన సీనియర్ నేత మాజీ మంత్రి నెల్లూరు జిల్లాకు చెందిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. ఆయన తాజాగా మాట్లాడుతూ జగన్ తప్పు చేశారని సంచలన కామెంట్స్ చేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకోకపోవడం వైసీపీ చేసిన తప్పు అన్నారు. ఈసారి అవకాశం వస్తే పొత్తు పెట్టుకోవాలని సూచిస్తామని అన్నారు. ఇదిలా ఉంటే దేశంలో బీజేపీ అత్యంత బలంగా ఉంది. మోడీ ప్రజాకర్షణ నేతగా ఉన్నారు. పాక్ తో ఇటీవల జరిగిన పరిమిత స్థాయి దాడులు యుద్ధ వాతావరణం నేపధ్యంలో మోడీ మరింత బలోపేతం అయ్యారు. దేశ ప్రజలు మోడీని అత్యంత శక్తివంతమైన నేతగా చూస్తున్నారు. దాంతో ఈ ఇమేజ్ తో ఆయన మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తారని అంచనాలు ఉన్నాయి. ఇక వచ్చే ఎన్నికల్లోగా పాక్ తో ఒక మాదిరి యుద్ధం జరిగినా జరగవచ్చు అంటున్నారు. అదే కనుక జరిగితే మోడీ వెంటే దేశమంతా ఉంటుందని కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే మోడీతో బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలకు కూడా ఎంతో మేలు జరుగుతుందని విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చూస్తే మళ్ళీ బీజేపీ జనసేన టీడీపీ కూటమికి రాజకీయ వాతావరణం అనుకూలించే చాన్స్ ఉంది అని అంటున్నారు. దాంతో వైసీపీలో ఒక చర్చ జరుగుతోంది. దాని ఫలితమే నల్లపురెడ్డి తాజా కామెంట్స్ అని అంటున్నారు. బీజేపీతో మొదటి నుంచి స్నేహంగా ఉన్నది వైసీపీయే అని ఆ పార్టీలో వారు అనుకుంటున్నారుట. బీజేపీ పెద్దలు జగన్ తో ఎంతో సన్నిహితంగా ఉంటూ వచ్చారని చెబుతున్నారు. 2019 నుంచి 2024 మధ్యలో అయితే ఏకంగా ఎన్డీయే ప్రభుత్వంలో చేరమని రెండు మంత్రి పదవులు ఇస్తామని కూడా ఆఫర్ చేసినట్లుగా కూడా చెబుతున్నారు. ఇక డిప్యూటీ స్పీకర్ కూడా ఇస్తామని ఒక దశలో ప్రతిపాదించారని గుర్తు చేస్తున్నారు. అయితే మైనారిటీలు దళితులు ఇతర వర్గాల ఓటు బ్యాంక్ కి గండి పడుతుందని భావించే జగన్ బీజేపీతో పొత్తులకు దూరంగా ఉన్నారని అంటున్నారు. అయితే జగన్ వ్యూహం అంచనాలు తప్పు అయ్యాయని 2024 ఫలితాలు నిరూపించాయని అంటున్నారు. మైనారిటీలు ఎస్టీలు దళితులు టీడీపీ కూటమి వైపు మొగ్గ చూపడంతో చరిత్రలో కనీ వినీ ఎరగని తీరులో కూటమి 164 సీట్లను సాధించింది అని గుర్తు చేస్తున్నారు. మోడీ ఇమేజ్ ముందు ఇవన్నీ కొట్టుకుపోతున్నాయని అంటున్నారు. నిజానికి ఎన్డీయే కూటమిలో వైసీపీని చేరమని మహారాష్ట్రకు చెందిన కేంద్ర మంత్రి రాందాస్ అతవాలే వంటి వారు కూడా అనేక సార్లు చెప్పారని గుర్తు చేస్తున్నారు. అయితే వైసీపీ ఆఫర్లు అన్నీ వదిలేసుకుని ఇపుడు దిగాలుగా చూస్తోందని అంటున్నారు. వైసీపీ తటస్థ విధానం ఈ రోజున ఏపీ రాజకీయాల్లో అసలు పనికిరాదు అని ఆ పార్టీలో సీనియర్లు అంటున్నారుట. టీడీపీ కూటమి బలంగా ఉందని ఒంటరిగా వైసీపీ ఎన్నికలకు వెళ్తే ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పడం కష్టమని అంటున్నారు. మరి ఇవన్నీ బాగానే ఉన్నాయి కానీ వైసీపీ వదిలేసుకున్న చాన్స్ ని టీడీపీ ఒడుపుగా పట్టుకుంది. ఇపుడు కూటమి మిత్రులు హ్యాపీగా ఉంటున్నారు. ఈ మధ్యలోకి వైసీపీ ఎలా ప్రవేశించగలదు అన్నదే చర్చగా ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీయే నుంచి బయటకు వచ్చి వైసీపీకి చాన్స్ ఇచ్చేలా టీడీపీ వ్యవహరించదు అని అంటున్నారు. ఇక పవన్ కళ్యాణ్ ఈ కూటమి కలసికట్టుగా ఉండేందుకు ఏమి చేయాలో అన్నీ చేస్తారని అంటున్నారు. దాంతో బీజేపీ కూడా వైసీపీ వైపు చూసే అవకాశాలు అయితే లేవు అని అంటున్నారు. మొత్తానికి వైసీపీ అధినేత తనదైన విధానాలతో గెలుపు అవకాశాలను తగ్గించుకుంటున్నరు అన్నదే సీనియర్ల వేదనగా ఉంది అంటున్నారు. మరి బీజేపీ వైసీపీల మధ్య ఎప్పటికైనా పొత్తు కుదురుదుందా అధినేత వైఖరి మారినా ఆ చాన్స్ వస్తుందా అంటే కాలమే జవాబు చెప్పాలని అంటున్నారు.

### అనకాపల్లిలో టీడీపీ మినీ మహానాడు

**అనకాపల్లి, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి):** పాయకరావుపేట నియోజకవర్గం,యస్ రాయవరం మండలం అడ్డురోడ్డులో అనకాపల్లి జిల్లా మినీ మహానాడు జరిగింది. హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించారు. మినీ మహానాడులో అనకాపల్లి జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లురవీంద్ర,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గోన్నారు.

## విశ్వ సత్యాలు



నేర్చుకుంటే పాఠము
బాగుపడును జీవితము
లేదంటే కకావికలము
తోక తెగిన గాలిపటము
పెద్దవారి హెచ్చరికలు
తప్పించును ప్రమాదము
పాటిస్తే జాగ్రత్తలు
జీవితాలు బహు పదిలము
విలువైనవి సత్యాలు

అమూల్యమైన ముత్యాలు
అక్షరాల వాస్తవమ్ము
కాంతులీను కాగడాలు
మేనులోని అందాలు
వాడిపోయే పుష్పాలు
అంతరంగ సుగుణాలు
వెలలేని ఆభరణాలు

**గద్వాల సోమన్న,**
సెల్:9866414580

## శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 46 వ,డివిజన్ మిల్క్ ఫ్యాక్టరీ ఎదురుగా కొండపై గల శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయంలో ప్రాతః కాలం నుండి పంచముఖ ఆంజనేయ స్వామివారికి 11 ద్రవ్యములతో అభిషేకము మరియు నాగవల్లితో సహస్రనామార్చన కార్యక్రమము నిర్వహించామని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సహాయ అర్చకులు చింతలపాటి నాగ వెంకట పవన్ కుమారులు తెలిపారు, గురువారం మిల్క్ ప్రాజెక్ట్ భీమన వారి పేట వద్ద వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పంచముఖ ఆంజనేయ స్వామి వారికి వివిధ రకాల పండ్ల రసాలతో 11 సుగంధ ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఈ దేవాలయంలో హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రాతః కాలం నుంచి స్వామివారి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు అనంతరం కమిటీ వారి పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

### ఎన్టీఆర్ జిల్లా బిజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్

**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్.ఓ.సీ పత్రాలను అడ్డూరి శ్రీరామ్ గురువారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా నాలుగు స్తంభాల సెంటర్ కు చెందిన దండుగల లలిత ( 18) గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 3, లక్షల 21 వేల ఎల్.ఓ.సీ పత్రాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా వన్ టౌన్ బ్రాహ్మణ వీధికి చెందిన నాగపోగు పరంజ్యోతి (34) గైనిక్ సమస్యతో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 1 లక్ష 80 వేల ఎల్.ఓ.సీ పత్రాన్ని అందించారు. పార్టీలకతీతంగా సేవలందిస్తూ పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు. త్వరితగతిన ఎల్.ఓ.సి మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పట్నాయక్, దొడ్ల రాజా, పచ్చిపులుసుల ప్రసాద్, కందుల సుబ్రహ్మణ్యేశ్వరరావు , పిళ్ళ శ్రీనివాసరావు , దుర్గారావు, షర్మిల తదితరులు పాల్గొన్నారు.



## వాగు సెంటర్ శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా అన్న ప్రసాద వితరణ





**విజయవాడ పశ్చిమ మే 22 (వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వాగు సెంటర్ శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ అర్చకులు పరాశరం పవన్ కుమార్ చార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు, గురువారం స్వామి వారి దేవస్థానంలో హనుమత్ వ్రతాలు నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా వేకువ జాము నుండి స్వామివారికి అభిషేకములు 108 మంది దంపతులచే హనుమత్ వ్రతాలు నిర్వహించమని తెలిపారు అనంతరం ప్రముఖ పారిశ్రామికవేత్త లక్కీ వెడ్డింగ్ కార్డ్స్ అధినేత చింతలపూడి సత్యనారాయణ, శ్రీమతి వెంకట లక్ష్మి దంపతులచే సుమారు 2000 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు, ఈ కార్యక్రమాన్ని ఆలయ ఫౌండర్ ప్రెసెంట్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వాహక అధికారి వై సీతారామయ్య ,పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ మార్గం ద్వారా తీర్థ ప్రసాదాలను, అన్న ప్రసాదాలను అందజేశారు.

### పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల హనుమాన్ జయంతి వేడుకల్లో

## పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి





**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ పశ్చిమ లోని పలు దేవాలయాలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో స్వామి వారిని మాజి మంత్రివర్యులు, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వన్ టౌన్ శేషయ్య వీధిలోని శ్రీ కృష్ణ ప్రార్ధన మందిరం లో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని వెలంపల్లి స్వామి వారిని దర్శించుకున్నారు. దుర్గా ఘాట్ నందు హనుమాన్ జయంతి సందర్భంగా దుక్క వేణు ఫ్రెండ్స్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. టేనర్ పేట అడ్డ రోడ్ వద్ద గల ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే టేనర్ పేట అడ్డ రోడ్ నందు హనుమాన్ జయంతి సందర్భంగా నెర్జి మన్మధరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పాల ఫ్యాక్టరీ వద్ద గల హనుమాన్ దీక్ష పీఠం నందు హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## నగరాల కులస్థుల మనసు గెలుచుకున్న ఎమ్ పి కేశినేని శివనాధ్ చిన్ని

### నగరాల కులస్తులు తెదేపా నాయకుల హర్షం



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి )** నగరాల కులస్తులకు అన్ని విధాలుగా సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చిన ఎమ్ పి కేశినేని చిన్ని నిర్ణయం పట్ల తెదేపా నగరాల కులస్తుల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పశ్చిమ నియోజకవర్గం, మరియు పార్లమెంట్ నియోజకవర్గం పరిది లో జరిగిన మినీ మహానాడు లో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాధ్ చిన్ని మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లో నగరాల సామాజిక వర్గానికి చెందినటువంటిమాజీ శాసనసభ్యులు సర్దార్ మరుపిళ్ళా చిట్టి విజయా పాల ఫ్యాక్టరీ నిర్మాణానికి తన సొంత స్థలాన్ని కేటాయించి పాల ఫ్యాక్టరీ నిర్మాణాం లో తన పూర్తి సహకారం అందించి భావి తరాల అవసరాల దృష్ట్యా ఈ పాల ఫ్యాక్టరీ స్థాపించుటకు గాను పెద్ద మనసుతో తన సహాయం అందించారని గుర్తు చేశారు. ఈ రోజు విజయా పాల డైరీ సంస్థ దినదినాభివృద్ధి చెందుటకు ముఖ్య భూమిక పోషించిన సర్దార్ మరుపిళ్ళా చిట్టీ విగ్రహం స్థాపించుటకు మినీ మహానాడు కేంద్రంగా తీర్మానం చేసి, తన వంతు కృషి ని అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పశ్చిమ నియోజకవర్గం లో కూటమి విజయం లో కీలక పాత్ర పోషించిన పశ్చిమ నియోజకవర్గం పార్టీ శ్రేణులకు గాను అత్యధిక సంఖ్యలో నామినేటెడ్, మరియు పార్టీ లో ను పదవులు అత్యధికంగా కల్పిస్తానని ప్రకటించడం కూడా జరిగింది. మినీ మహానాడు వేదికగా ఎమ్ పి చేసిన తీర్మానానికి గాను విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 51 డివిజన్ కార్యాలయం నందు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి ఎమ్ పి కేశినేని శివనాధ్ చిన్ని కి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర తెదేపా నగరాల సాధికార సమితి కన్వీనర్ మరుపిళ్ళా తిరుమలేష్, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు సుఖాసీ కిరణ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి బెవర సాయిసుధాకర్,51 వ డివిజన్ మాజీ అధ్యక్షులు ఈది నాగేశ్వరావు, అలాగే తెలుగు యువత నాయకులు పైలా సతీష్, రాళ్ళపూడి మాధవ, తమ్మిన శేఖర్, బెవర రవి, సుఖాసీ రమణ, రాయన చిన్న, పొట్నూరి శేషు,పాల్గొన్నారు.

## శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై వైభవంగా హనుమత్ జయంతి





**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడలో ఇంద్రకీలాద్రి పై హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు వైభవం గా జరిగాయి. ఉదయం 6 గంటల నుండి – అమ్మవారి ఆలయప్రాంగణంలో గల క్షేత్రపాలక శ్రీ ఆంజనేయస్వామి, ఘాట్ రోడ్ లో గల ఆంజనేయస్వామి,పాత మెట్ల మార్గంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకములు, నాగవల్లీ దళార్చన, రుద్ర సహిత మన్యు సూక్త హోమ కార్యక్రమములు, పూర్ణాహుతి మంత్రపూర్వకంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉప ప్రధాన అర్చకులు శ్రీ శంకర శాండిల్య, శ్రీ కోట రవికుమార్ తదితరులు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## శ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారిదేవస్థానము లో వైభవంగా హనుమత్ జయంతి వేడుకలు



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చిట్టినగర్ గుజ్జరి ఎల్లారావు మున్సిపల్ మార్కెట్ లో శ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్బారావు, అధ్యక్షుడు ధూళిపూడి వెంకట రమణ బాబు, కార్యదర్శి సామా వెంకట స్వామి,ఉపాధ్యక్షులుకోన హేమసుందరరావు నాగోతి రామారావు,తదితరులు పాల్గొన్న ఈ వేడుకలు మూడురోజులు పాటు నిర్వహించారు. కాగా ఈ మూడురోజుల్లో పూజా ద్రవ్యాలు, గురువారం ప్రసాదాలు పంపిణీ కార్యక్రమానికి వేలాది రూపాయలు వెచ్చించిన కార్యవర్గ సభ్యులు బొమ్మిశెట్టి శ్రీనివాస శంకర్ ని కమిటీ సభ్యులు అభినందించారు.

## అన్న క్యాంటీన్లో ప్రజల్లోకి ఎటువంటి ఇబ్బంది పడకుండా చూసుకోండి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అన్న క్యాంటీన్ లోకి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం గాంధీజీ మహిళా కళాశాల వద్ద గల అన్న క్యాంటీన్ ను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడున్న ప్రజలతో స్వయంగా తానే మాట్లాడి ఆహార నాణ్యత, అన్న క్యాంటీన్లో ఉన్న వసతుల పై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అన్న కాంటీన్ లో ఆహారం సేవించే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ఆహార నాణ్యత, ఇచ్చే టోకెన్లు, వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు .ప్రతిరోజు నోడల్ ఆఫీసర్లు తమ తమ అన్న క్యాంటీన్ ను పరిశీలించి ఎటువంటి మరమ్మతులున్నా వెంటనే చేయించాలని. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల అన్నా క్యాంటీన్లలో ఎటువంటి సమస్య తలెత్తకూడదని. అందుకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ ఉండాలని అన్నారు.

## రూ.1.40 లక్షల విలువైన బంగారు నగల చోరీ

**ఇబ్రహీంపట్నం, మే 22 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని గుంటుపల్లి ఖాజీపేటలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. క్రైం పోలీసుల కథనం ప్రకారం ఖాజీపేటలో నివసిస్తున్న బాణావతి విజయలక్ష్మి ఈనెల 19న కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్ర వెళ్లారు. బుధవారం రాత్రి ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు రూ.1.40 లక్షల విలువైన బంగారు నానుతాడు, నల్లపూసల గొలుసు, 70 గ్రాముల నక్లెస్ అపహరించుకుపోయారు. చోరీ జరిగిన విషయాన్ని గురువారం గుర్తించిన విజయలక్ష్మి సోదరుడు నేనావత్ శ్రీనివాసరావు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యోగమే చివరి అవకాశం కాదు- పార్లమెంట్ సభ్యులు బాలశౌరి.

**ఘనంగా కెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ అచివర్స్ డే**




మచిలీపట్నం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)విద్యార్థికి ఉద్యోగమే చివరి అవకాశం కాదు అని, రెడ్ బస్ వ్యవస్థాపకుడు ఫణీంద్ర శర్మ...రెడ్డి లాబ్స్ వ్యవస్థాపకులు అంజి రెడ్డి లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని మరింత ఎత్తుకు ఎదగాలని పార్లమెంట్ సభ్యులు బాలశౌరి పేర్కొన్నారు. గురువారం కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ అచివర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పండగకు ఇంటికి వెళ్లేందుకు బస్ టికెట్ దొరకలేదని, తనకు లాగా మరొకరు ఇబ్బంది పడకూడదని ఐదు లక్షల రూపాయలు తో రెడ్ బస్ సంస్థను స్థాపించి ఎనిమిది వందల కోట్ల కు ఆ సంస్థను విక్రయించిన ఫణీంద్ర శర్మ ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఐడిపిఎల్ సంస్థలో చిన్న ఉద్యోగం చేసుకునే అంజి రెడ్డి ఆ ఉద్యోగం తో సంతృప్తి చెందక రెడ్డి లాబ్స్ ఫార్మా కంపెనీ స్థాపించి వేలకోట్ల టర్నోవర్ సాధిస్తున్నారని ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విజయాలు ఒక రోజులో రావు అని, పట్టుదల, క్రమశిక్షణ తో సాధించవచ్చని చెప్పారు. కృష్ణా విశ్వవిద్యాలయం లో అథ్లెటిక్ ట్రాక్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్టు నిర్మాణం కోరుతూ కేంద్ర ప్రభుత్వం కు ప్రతిపాదనలు చేయడం జరిగింది అని వాటి సాధనకు కృషి చేస్తానని సభా ముఖంగా ప్రకటించారు.జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ చిన్న కుటుంబంలో జన్మించిన తాను విద్యను నమ్ముకునే ఈ స్థాయికి చేరుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులు ఆటకాయి వ్యవహారాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ ప్రారంభోపన్యాసం చేస్తూ రెండున్నర లక్షల నుండి నాలుగు లక్షల ప్యాకేజీ తో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. వ్యక్తిగత నైపుణ్యం పెంచుకుంటే మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డి సి ఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య వై కే సుందర కృష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం సమన్వయకర్త డాక్టర్ కిషోర్, పలు విభాగాల ఆచార్యులు, సహాయ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం చేసి వారి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. తొలుత డా బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం కు ఎంపి బాలశౌరి, ఎస్ పి గంగాధరరావు లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె



కంకిపాడు మే 22 (వార్తా ప్రభ, ప్రతినిధి)మండలంలోని కాసాలనేని వారి పాలెం లో ఎన్ఆర్జిఎస్ 45 లక్షల నిధులతో గ్రామంలోని బ్రిడ్జి నుండి చెరువు వరకు నిర్మించిన తారు రోడ్డును గురువారం పెనమలూరు నియోజకవర్గం శాసనసభ్యులు బోడె ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా గ్రామాల్లో అమలు చేస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో గ్రామాలకు నిధులు కేటాయింపు చేసి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నేరుసు రాజ్యలక్ష్మి, ఎండిఓ అనూష, కార్యదర్శి చింత కిరణ్ కుమార్, తెలుగుదేశం,జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య సేవలను ప్రోత్సహిస్తాం

**- బోర్డు సీఈఓ చంద్రశేఖర్ ను అభినందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



, విజయవాడ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఆయుర్వేద వైద్య విధానాన్ని అన్ని విధాలా ప్రోత్సహిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రాచీన వైద్య పద్ధతులను కొనసాగించేందుకు, ఔషధ మొక్కలతో అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం ఏపీ ఔషధ సుగంధ మొక్కల బోర్డు సీఈవో ఆవుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఔషద మొక్కల ప్రదర్శన నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రదర్శనను ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఔషధ, సుగంధ మొక్కల ఉపయోగాలను ప్రజలకు వివరించాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. బోర్డు సీఈవో చంద్రశేఖర్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రదర్శనలోని వివిధ రకాల ఔషధ మొక్కలను పరిశీలించి వాటి ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల నుంచి మాత్రలు, టానిక్కు, పొడి వంటి వాటిని ఎలా రూపొందిస్తారని సీఈఓ చంద్రశేఖర్ వివరించారు. ఇప్పటివరకు 900 ఔషద మొక్కలకు జియో ట్యాగింగ్ చేశామని, మరో వెయ్యి మొక్కలకు జియో ట్యాగింగ్ చేయాల్సి ఉందని సీఈవో వివరించారు. ఔషధ మొక్కల ప్రదర్శనను భారీగా ఏర్పాటు చేయడం పట్ల ఉపముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. బోర్డు రూపొందించిన ఔషధ మొక్కల పరిశోధన గ్రంథాలను ప్రత్యేకంగా పరిశీలించారు. పొలాలు ఇంటివద్ద ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలను పెంచుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రకృతితో సామరస్యం పాటిస్తేనే సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈవో ఆవుల చంద్రశేఖర్ మాట్లాడుతూ, సంప్రదాయ వైద్య విధానాలను కాపాడేందుకు నిరంతరం కృషి సాగిస్తామన్నారు.జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ అనారోగ్యాలకు, ఒత్తిడిని తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తులసి ఉపయోగపడుతుందన్నారు. జీర్ణశయాన్ని మెరుగుపరచడానికి, వాంతులు మరియు వికారం తగ్గడానికి, ఆస్టియో ఆర్థరైటిస్ నుండి ఉపశమనం పొందడానికి అల్లం సహాయపడుతుందన్నారు. బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, నొప్పులు మరియు చికెన్ పాక్స్ వంటి అనేక వ్యాధులను నయం చేయడానికి వేపాకు సహాయపడుతుందని చెప్పారు. చర్మం, రక్త శుద్ధీకరణకు కూడా వేపాకు సహాయపడుతుందన్నారు. కాలిన గాయాలను నయం చేయడానికి, జీర్ణ, నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కలబంద సహాయపడుతుందని వివరించారు. ఇది చర్మం, జుట్టుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. పసుపు యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబియల్ లక్షణాలను కలిగి ఉందన్నారు. కీళ్ల నొప్పులు, జలుబు, ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో పసుపు సహాయపడుతుందన్నారు. ఒత్తిడిని తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, శక్తిని పెంచడానికి అశ్వగంధ సహాయపడుతుందన్నారు. కండరాల నొప్పి, ఆందోళనను కూడా తగ్గించగలదని చెప్పారు. జీర్ణక్రియను మెరుగుపరచడానికి, ఉద్రిక్తత, తలనొప్పి, ఋతు తిమ్మిరి నుండి ఉపశమనం పొందడానికి మిరియాలు సహాయ పడుతున్నాయన్నారు. కీళ్ళ నొప్పులు, జలుబు, ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి నానకూర సహాయపడుతుందని, జీర్ణశయాన్ని కూడా మెరుగుపరుస్తుందని తెలిపారు.

## కూటమి ప్రభుత్వం నిర్ణయం వల్ల రాష్ట్రంలో
# రేషన్ లబ్ధిదారులకు ఇబ్బందులే

**వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి. బాజీ బాబా**



విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)వైఎస్ జగన్ హయాంలో దేశంలో ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా నిలిచిన రేషన్ పంపిణీ విధానాన్ని కాదని కూటమి ప్రభుత్వం వాహనాలను నిలిపేస్తూ నిర్ణయించడం వల్ల రేషన్ కార్డు దారులకు ఇక ఇబ్బందులేనని రాష్ట్ర వైసీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ బాజీ బాబా అన్నారు. చంద్రబాబు ప్రజలకు మేలుచేసే ఈ పథకాన్ని దుర్వినియోగం అంటున్నారు. కానీ సన్న బియ్యం మాట అటక ఎక్కించారు.ఏడాదిలోనే లక్షా డెబ్బై వేల కోట్లు అప్పుచేసిన కూటమి సర్కార్ సూపర్ సిక్స్ లేదు సంక్షేమపథకాలను అమలు చేయలేదని ఆయన ఆరోపించారు.24గంటలు మద్యం బార్లు దుకాణాలు,ఇంటింటికీ మందు డెలివరీ మాత్రం జరుగుతోంది.కానీ రేషన్ డెలివరీ చేయకూడదట.దుబారా ఖర్చట తుఫాన్లు,వరదలు వచ్చినప్పుడు రేషన్ తోపాటు ఎన్నో నిత్యవసర వస్తువులు ఈవాహనాల ద్వారా పంపిణీ చేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.కేవలం వైయస్సార్ ప్రభుత్వం దీన్నిపథకమనే దీన్ని ఆపేశారు.మొత్తంమీద గతంలో వలే రేషన్ దుకాణాల ముందు వృద్ధులు మహిళలు పడిగాపులు పడే దుస్థితి దాపురిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.గత జగనన్న ప్రభుత్వంలో నవరత్నాలు అమలుపరిచిన తీరును ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.రేషన్ దుకాణాల వాహనదారులకు న్యాయం చేయాలని ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

# భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్మెంట్ గ్యారెంటీ యాక్ట్ ను అమలు చేయాలి.

● ఘనంగా ముగిసిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు ● ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి జాతీయ కార్యదర్శిగా పరుచూరి రాజేంద్ర బాబు ఎన్నిక. ● జాతీయ సమితిలో రాష్ట్రానికి 9 మందికి దక్కిన చోటు.




విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)దేశంలో భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ను తీసుకొని వచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంప్లాయిమెంట్ ను గ్యారెంటీ చేస్తూ చట్టం చేయాలని అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్,పరుచూరి రాజేంద్ర బాబు, లు డిమాండ్ చేశారు. అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి పత్రికా విలేకరుల సమావేశం గురువారం స్థానిక హనుమాన్ పేటలోని దాసరిభవన్లోనీ ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం నందు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 17 నుండి 18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఏఐవైఎఫ్ మహాసభలు ఘనంగా నిర్వహించడం జరిగిందని మొదటిరోజు బహిరంగ సభ మూడు రోజులపాటు 29 రాష్ట్రాల నుండి ప్రతినిధుల సభ నిర్వహించడం జరిగిందని మహాసభ సందర్భంగా 32 తీర్మానాలను ఆమోదించుకొని రానున్నటువంటి రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి యువజన వ్యతిరేక విధానాలపై నిరుద్యోగ సమస్యపై గొంతెత్తి నినదించాలని వామపక్ష ఉద్యమ బలోపేతం కు ఏఐవైఎఫ్ చొరవ తీసుకొని అన్ని యువజన విద్యార్థి సంఘాల్ని కలుపుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని నిర్ణయం చేయడం జరిగిందని తెలిపారు. ఈ మహాసభల్లో ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబును, నేషనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, రాష్ట్ర ఆర్గనైజషన్ కార్యదర్శి గండాల సంతోష్ కుమార్, జాతీయ సమితి సభ్యులుగా గంట మమత, జి నాగరాముడు, వై బాబి, కత్తి రవి, కే శ్రీనివాస్, షేక్ సుభాని లను ఎన్నిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పనే మా ప్రభుత్వ ధ్యేయమని ప్రకటించి 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్నటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వ శాఖల్లో దేశవ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని ప్రభుత్వ లెక్కలు చెప్తుంటే ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ రంగ సంస్థలైనటువంటి విశాఖ ఉక్కు పరిశ్రమ రైల్వే బిఎస్ఎన్ఎల్ లాంటి సంస్థలు అన్నిటిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రభుత్వ దేవి అని చెప్పి నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3 వేల రూపాయలు ఇచ్చేటటువంటి బాధ్యత నాది తమ్ముళ్లు అని చెప్పినటువంటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేరు అధికారంలోకి వచ్చే సంవత్సరకాలం గడుస్తున్న నిరుద్యోగ భృతి విధి విధానాలు ఎప్పుడు ప్రకటిస్తారు అనేటువంటిది తెలియజేయడం లేదని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో శ్వేతపత్రం విడుదల చేసేటటువంటి పరిస్థితి రాష్ట్రంలో లేకుండా పోయిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షించాలని కడప స్టీల్ ఫ్యాక్టరీ నిర్మించాలని, ప్రత్యేక హోదా విభజన హామీలను సాధించాలని రాష్ట్రానికి రావలసినటువంటి నిధులు నియామకాలు నీళు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలని, అమరావతి రాజధాని ఫ్రీ జోన్ గా ప్రకటించి 26 జిల్లాలకు సంబంధించినటువంటి అభ్యర్థులను ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మహాసభలో తీర్మానించడం జరిగిందని అదేవిధంగా భగత్ సింగ్ ఉపాధి హామీ చట్టం ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని,సామాజిక న్యాయం , రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలని, వామపక్ష యువజన విద్యార్థి ఐక్యత కొనసాగించాలని,ఎన్నికల పారదర్శకత మరియు ప్రజాస్వామ్య సంస్కరణలను కోరుతూ కోటి మందితో సంతకాల సేకరణ నిర్వహించాలని,అందరికీ నైపుణ్యం కలిగిన విద్య, మెరుగైన వైద్యం ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం పోరాడాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కొరకై ఉద్యమించాలని,లౌకికవాదం మరియు ప్రజాస్వామ్య హక్కులను కాపాడలని, ఐటీ సెక్టర్ లో నైపుణ్య ప్రాతిపదికను కాకుండా కుల ప్రాతిపదికన ఉద్యోగాల కల్పన జరుగుతున్నటువంటి నేపథ్యంలో నైపుణ్య ప్రాతిపదికన అందరికీ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నిరుద్యోగం పెరుగుతున్నటువంటి నేపథ్యంలో టెక్నాలజీని అందిపుచ్చుకుంటూనే నిరుద్యోగాన్ని ఏ విధంగా రూపుమాపాలి అనేటువంటి విషయం మీద రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కంచర్ల భార్గవ్ లంక గోవిందరాజులు, సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్ ప్రసాద్, లంకే సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడికాయల లోడు ట్రాక్టర్ తగిలి బాలుడు మృతి



జి.కొండూరు మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి):మామిడికాయల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ తగిలి 7 సంవత్సరాల బాలుడు మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామ శివారు ఒక ఇటుకల బట్టి వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రం, నబరంగపూర్ జిల్లా, జారిగావ్ గ్రామానికి చెందిన మంచు గౌడ్ నీలాంద్రి గౌడ్ దంపతులు వెల్లటూరు గ్రామశివారులోని ఓ ఇటుకల బట్టిలో గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు.వారు పనిచేసే ఇటుక బట్టీల పక్కన డొంక రోడ్ లో నుంచి మైలవరం మండలం, చంద్రాల గ్రామానికి చెందిన (ఏపీ 37 ఏఎఫ్ 6447, ట్రక్ నంబర్ ఏపీ 16వి 0418) ట్రాక్టర్ మామిడికాయల లోడుతో వెళ్తుండ గా మంచు గౌడ్ నీలాంద్రి గౌడ్ దంపతుల పెద్ద కుమారుడు శంకర్ గౌడ్, రెండో కుమారుడు దేబరాజు గౌడ్(7) మామిడికాయల కోసం ట్రాక్టర్ వెనుక పరిగెత్తుతుండగా ట్రాక్టర్ పై ఉన్న కూలీలు వారిని చూసి మామిడి కాయలు కింద విసిరేయగా కింద పడిన మామిడికాయలు ఏరుకునే క్రమంలోదేబరాజు గౌడ్ అనే బాలుడి తలకు ట్రాక్టర్ బలం గా తగిలింది.దీంతో కింద పడిపోయిన బాలుడిని ఇటుక బట్టి యజమాని తన కారులో మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. బాలుడిని పరీక్షించిన డాక్టర్లు అప్పటికే బాలుడు చనిపోయా దని నిర్ధారణ చేశారు.బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మంచు గౌడ్ నీలాంద్రి గౌడ్ దంపతులు బాలుడికి మైలవరం లోనే అంతిక్రియలు జరిపినట్లు పోలీసులు తెలిపారు.

## పామూరు పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా వీర హనుమాన్ శోభాయాత్ర



కనిగిరి మే 22 వార్తా ప్రభ ప్రతినిధికనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా కనిగిరి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య సారధ్యంలో శోభాయాత్రను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. పామూరు పట్టణంలోని శ్రీ మదన వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి ఆంజనేయ స్వామిని ట్రాక్టర్ పై తీన్మార్, డీజే పాటలతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, టిడిపి మండల నాయకులు యారవ శ్రీనివాసులు, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, వెంకట్ రెడ్డి, పాలపర్తి వెంకటేశ్వర్లు, వరదా ఓబులేసు, ఓగూరు ఏడుకొండలు, ఇర్ల సత్యం, తదితర భక్త బృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేజర్లలో ఘనంగా శ్రీ హనుమాన్ జయంతి



చేజర్ల మే 22 (వార్తాప్రభ) మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయం విగ్రహం దగ్గర గురువారం హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని చేజర్లలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా ఇక్కడ భక్తులకు అన్నదానం చేస్తూ భక్తుల మన్ననలను పొందుతున్నారు. అలాగే ఎంతో శక్తివంతుడైన ఆంజనేయుడు భక్తులు కోరిన కోరికలను తీరుస్తూ భక్తుల నుండి ఘనమైన పూజలు అందుకుంటున్నారు.ఈ కార్యక్రమం బూదళ్ళ వీరరాఘవ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ హనుమాన్ జయంతి కార్యక్రమంలో భక్తులతో పాటు చేజర్ల గ్రామ మాజీ సర్పంచులు బూదల్ల విజయమ్మ రావి లక్ష్మీనరసింహా రెడ్డి పాల్గొని శ్రీ అభయాంజనేయ ఆశీస్సులు అందుకున్నారు.వారితోపాటు వెంకటేశ్వర్లు రెడ్డి పెంచలయ్య మరియు మహిళలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

*ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఎంపీ వల్లభనేని బాలశౌరి*



గన్నవరం: మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనులు వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని విజయవాడ ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన గన్నవరం విమానాశ్రయం విశిష్ట అతిథుల భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో విజయవాడ ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ కో చైర్మన్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), కమిటీ సభ్యులు, ఇతర అధికారులతో కలిసి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనుల పురోగతి, సమస్యలపై సమీక్షించారు.న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన నిర్మాణం, సీలింగ్, ఎలివేషన్ పనులు, కారు పార్కింగ్ ఏరియా, సబ్ స్టేషన్ నిర్మాణం, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం పట్ల ఇరువురు ఎంపీలు అసహనం వ్యక్తం చేశారు. ఆయా పనుల పురోగతి ఆలస్యానికి గల కారణాలపై ఆరా తీస్తూ ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యతగా భావించి నిర్ణీత సమయానికి పూర్తి చేసే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.విజయవాడ విమానాశ్రయం నుండి కొత్త అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించాలని, ముఖ్యంగా శ్రీలంక, థాయిలాండ్, దుబాయ్, యుఎస్ఏ వంటి ప్రాంతాలకు డైరెక్టర్ సర్వీసులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ సంస్థ అధికారులను కోరారు. అదేవిధంగా విమానాశ్రయ విస్తరణలో భాగంగా నెలకొన్న భూ సమస్యలు, కోర్టు వివాదాలు, ఏలూరు కాల్వ పై వంతెన నిర్మాణం, రైతులకు పరిహారం చెల్లింపు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు.ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ కో చైర్మన్ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ విమాన ప్రయాణికుల డిమాండ్ మేరకు అవసరమైన సర్వీసులను నడపాలని, ముఖ్యంగా కొచ్చిన్, అహ్మదాబాద్, వారణాసి వంటి ప్రాంతాలకు కొత్త సర్వీసులను నడపాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచనల మేరకు విమానాశ్రయంలో కూచిపూడి నృత్య కళారూపాలు ఎలివేషన్ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ప్రయాణికుల సౌకర్యార్థం బడ్జెట్ తో పాటు స్టార్ హోటల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గత సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధి పనుల పురోగతి, ఎయిర్ పోర్టు మాస్టర్ ప్లాన్, మౌలిక వసతుల కల్పన, ఎయిర్ లైన్ సర్వీసులు, కొత్త ప్రాజెక్టులు, సమస్యలపై ఎయిర్పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశా, కృష్ణా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, ఎయిర్పోర్ట్ జనరల్ మేనేజర్ కే రామాచారి, ఎయిర్పోర్ట్ ఆపరేషన్స్ హెడ్ వినీత్ కుమార్, సహాయ మేనేజర్ శ్రీలేఖ, గుడివాడ డివిజన్ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, కమిటీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యోగాంధ్ర స్ట్రీట్‌గా బీఆర్‌టీఎస్ రోడ్డు!

● జూన్ 21 వరకు రోజూ ఉదయం ప్రత్యేక యోగా కార్యక్రమాలు ● ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలి ● ప్రతిఒక్కరూ మరో ముగ్గురిని యోగాచరణ దిశగా ప్రోత్సహించాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**విజయవాడ, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో కనీసం రెండుకోట్ల మందికి యోగాలో ప్రవేశం లక్ష్యంతో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని.. ఇందులో భాగంగా జిల్లాలోనూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విజయవాడలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గురువారం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డు–సత్యనారాయణపురం వద్ద ప్రత్యేక యోగాభ్యసన కార్యక్రమం జరిగింది. ఇందులో కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులు పాల్గొని యోగాసనాలను సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మనిషి జీవన నాణ్యతను పెంచేందుకు, శ్రేయస్సుకు యోగా గొప్ప మార్గమని.. రోజూ యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతివృత్తం ఆధారిత యోగా సెషన్లతో పాటు వివిధ పర్యాటక ప్రాంతాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ట్రైనర్లు, పౌరుల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాటు చేస్తున్నామని.. ఈ నెల రోజుల పాటు యోగాసనాల అభ్యసనతో పాటు ఆసనాల ప్రదర్శన, సూర్య నమస్కార్, ప్రాణాయామ ప్రదర్శన, గ్రూప్ యోగా, ఆర్టిస్టిక్ యోగా.. ఇలా వివిధ విభాగాల్లో పోటీలు కూడా నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో జరిగే కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని.. జీవితాంతం యోగాను ఆచరిస్తూ, ఆచరింపజేస్తూ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని, ప్రతిఒక్కరూ మరో ముగ్గురిని యోగాచరణ దిశగా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు

**.మన చారిత్రక సంపదను సద్వినియోగం చేసుకోవాలి: మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర**

యోగా అనేది భారతీయ వారసత్వ, చారిత్రక సంపద అని.. ఈ సంపదను సద్వినియోగం చేసుకొని.. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారుకావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం అన్నారు. యోగా అభ్యసనను ఏ ఒక్క రోజుకో పరిమితం చేయకుండా జీవితాంతం ప్రతిరోజూ యోగాను ఆచరించడం వల్ల కొత్త ఉత్తేజంతో మంచి ఫలితాలు సాధించొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, కె.ప్రభుదాస్, కె.షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి ఖ్యాతిని పెంచిన టీడీపీ

● దేశ రాజకీయాలను ప్రభావితం చేయగల పార్టీ టీడీపీ ● కడపలో టీడీపీ మహానాడును విజయవంతం చేయాలి ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం పిలుపు
● లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో జగన్ సమాధానం చెప్పాలి: ఎంపీ కేశినేని చిన్ని ● టీడీపీ సభ్యుడిగా ఉండటం గౌరవం, మర్యాద: ఎమ్మెల్యే వసంత
● గుంటుపల్లిలో ఘనంగా ముగిసిన టీడీపీ ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడు





**ఇబ్రహీంపట్నం, మే 22 (వార్తా ప్రభ ప్రతినిధి):** టీడీపీ ఆవిర్భావం ఒక సంచలనమని, తెలుగు జాతి ఖ్యాతిని పెంచిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ మినీ మహానాడు గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ హాల్ లో గురువారం జరిగింది. టీడీపీ పతాకాన్ని ఎమ్మెల్యే వసంతతో కలిసి జిల్లా అధ్యక్షుడు రఘురామ్ ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి వెలిగించి మహానాడును ప్రారంభించారు. అధ్యక్షత వహించిన నెట్టెం మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవం కోసం 60 సంవత్సరాల వయస్సులో అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని చెప్పారు. టీడీపీ ఒక్క తెలుగు ప్రజలనే కాకుండా భారత రాజకీయాలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. గత ఐదేళ్ల రాష్ట్రంలో విధ్వంసకర పరిపాలన సాగిందని విమర్శించారు. కడపలో మొట్టమొదటిసారి జరిగే రాష్ట్ర మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో చెప్పాలని వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. దమ్ము, ధైర్యం ఉంటే జగన్ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. వైసీపీ గూండాలు, ఆకు రౌడీలు దౌర్జన్యాలు, దాడులు చేయాలని ప్రయత్నిస్తే ఆ చర్యలను తెలుగు తమ్ముళ్లు తిప్పి కొడతారని హెచ్చరించారు. ఎన్టీఆర్ సంక్షేమానికి బాటలు వేస్తే, సీఎం చంద్రబాబు సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా బాటలు వేస్తున్నారని చెప్పారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతి ఖ్యాతిని ఇనుమడింపజేసిన గొప్ప పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీ సభ్యుడిగా ఉండటం ఒక గౌరవం, మర్యాద అని చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం నాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, ఆయన ఆశయాల సాధనకు పార్టీ నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దార్శనికుడు, సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమం సాధ్యమన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షతతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని చెప్పారు. ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని, బుడమేరు ఆధునికీకరణ పనులు పూర్తిచేయాలని, జి.కొండూరు మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని, విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని రిటైనింగ్ వాల్ వద్ద పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేయాలని, నగరంలో కొత్త అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, ముక్త్యాల వేదాద్రి ఎత్తిపోతల పథకం సత్వరమే పూర్తి చేయాలని, వైకుంఠపురం – దాములూరు బ్రిడ్జి నిర్మించాలని మహానాడులో తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, విజయవాడ తూర్పు, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), స్వచ్ఛాంధ్ర మిషన్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, పరుచూరి అశోక్ బాబు, ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ తదితరులు ప్రసంగించారు.

## బక్రీద్ పండుగకు హైదరాబాద్ పోలీసుల సమన్వయ సమావేశం



**హైదరాబాద్, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని, హైదరాబాద్ నగరంలో శాంతియుత వాతావరణంలో, నగరాన్ని పరిశుభ్రంగా పెడుతూ పండుగను జరుపుకోవడానికి హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్, సి.వి. ఆనంద్ ఐపీఎస్ అధ్యక్షతన పాత పోలీసు కమిషనర్ ఆఫీసు, 5వ అంతస్తు కాన్ఫరెన్స్ హాల్ , బషీర్ బాగ్ నందు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సి.పి. లా అండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్ మాన్ ఐపీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఐఏఎస్, జాయింట్ ట్రాన్స్పోర్ట్ క మిషనర్ సి రమేష్ పంకజ్ అడిషనల్ కమిషనర్ హెల్త్ రఘు ప్రసాద్ అడిషనల్ కమిషనర్ సానిటేషన్ డాక్టర్ సిహెచ్ మల్లేశ్వరి అడిషనల్ డైరెక్టర్ వి అండ్ ఏ హెచ్ డిసిపి స్పెషల్ బ్రాంచ్ సైబరాబాద్ డిసిపి రాజేంద్రనగర్ డిసిపి బాలనగర్ డిసిపి ఎల్బీనగర్ మరియు హైదరాబాదు సిటీ పోలీసు కమిషనరేట్ కు సంబంధించిన డిసిపిలు, అడిషనల్ డిసిపి,డివిజన్ ఎసిపిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, సరైన వెటర్నరీ సర్టిఫికెట్లు లేని మరియు వధకు సిద్ధంగా లేని పశువులను అక్రమంగా తరలించడాన్ని నిరోధించడానికి హైదరాబాద్ నగర కమిషనరేట్ చుట్టూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను స్వాధీనం చేసుకుని, జీహెచ్ఎంసీ నిర్దేశించిన పశువుల హోల్డింగ్ పాయింట్లు లేదా గోశాలలకు తక్షణమే పంపించాలని ఆదేశించారు. పశువులను తీసుకెళ్లే వాహనాలను ఆపడం లేదా తనిఖీ చేయడం ప్రభుత్వ అధికారులు మరియు చట్టం అమలు చేసే సంస్థలు మాత్రమే చేయాలని, ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.పశుసంవర్ధక శాఖ మరియు జీహెచ్ఎంసీ అన్ని చెక్‌పోస్టుల వద్ద 24/7 వెటర్నరీ డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడాలని కోరడం జరిగింది.జీహెచ్ఎంసీ అధికారులకు బక్రీద్‌కు ముందు వీధి కుక్కలను పట్టుకోవడానికి అన్ని ప్రాంతాల్లో డాగ్ క్యాచింగ్ స్క్వాడ్‌లను మోహరించాలని, పశువుల కళేబరాల పారవేయడం కోసం ప్రతి ఇంటికి డిస్పోజల్ కవర్లను సరఫరా చేయాలని, పండుగ రోజున చెత్త, కళేబరాల సేకరణ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని సూచించారు. పశువుల వ్యర్థాలను సమర్థవంతంగా సేకరించడం మరియు పారవేయడం కోసం తగినన్ని వాహనాలు, టిప్పర్లు మరియు జేసీబీలను సమకూర్చాలని, బక్రీద్ సందర్భంగా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తొలగించడానికి సరిపడే సిబ్బందిని నియమించాలని కోరారు.విద్యుత్ మరియు ఇంజినీరింగ్ శాఖ పండుగ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు.హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి మరియు ఇంజినీరింగ్ అధికారులు మురుగు నీటి వ్యవస్థలను పర్యవేక్షించడం మరియు నిర్వహించడం, పండుగ సమయంలో నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని తెలిపారు.ఆర్‌టీఏ అధికారులు డ్రైవర్లు, మెకానిక్‌లు మరియు క్రేన్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.జీహెచ్ఎంసీ కమిషనర్ మాట్లాడుతూ, వార్డులు మరియు మసీదుల సమీపంలో అదనపు పారిశుధ్య బృందాలు మరియు చెత్త సేకరణ వాహనాలను మోహరించడంతో సహా అమలు చేస్తున్న విస్తృతమైన పారిశుధ్య చర్యలను వివరించారు. చెత్త సంచులు సిద్ధంగా ఉంటాయని, జీహెచ్ఎంసీ అధికారులు చురుకుగా విధులు నిర్వర్తిస్తారని ఆయన తెలిపారు.శ్రీ సి.వి. ఆనంద్ ఐపీఎస్, చెక్‌పోస్టులలో కేటాయించిన పోలీస్ సిబ్బంది, జీహెచ్ఎంసీ మరియు పశుసంవర్ధక శాఖ సిబ్బంది మాత్రమే ఉంటారని తెలిపారు. మెరుగైన సమన్వయం మరియు ప్రతిస్పందన కోసం అన్ని విభాగాల అధికారులతో కూడిన స్థానిక, జోనల్ మరియు కమిషనరేట్ స్థాయి సమన్వయ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిరంతర సమన్వయం, అధికారుల చురుకైన చర్యల వలన ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించడానికి ఈ సమన్వయంతో కూడిన యంత్రాంగం ఎంతగానో దోహదపడుతుందని, తద్వారా నగర వాసులు అందరు బక్రీద్‌ను సాఫీగా, సురక్షితంగా మరియు ఆనందదాయకంగా జరుపుకోవడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు.

## రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జి.యన్.రావు మృతి



**హైదరాబాద్ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రిటైర్డ్ సీనియర్ ఐఏఎస్ అధికారి గోపిశెట్టి నాగేశ్వరరావు గుండెపోటుతో బుధవారం హైదరాబాద్ కుందన్ బాగ్ లోని తన గృహంలో కన్ను మూశారు. జి.యన్.రావు గా ఆయన అందరికి సుపరిచితులు. వారి వయసు 77 సంవత్సరాలు. 2020లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ప్రత్యేకంగా మూడు రాజధానుల కమిటీ వేసి జి.యన్.రావును ఆ కమిటీకి చైర్మన్ గా నియమించారు. మూడు రాజధానులే రాష్ట్ర అభివృద్ధికి దోహదం అని జి.యన్.రావు ఆధ్వర్యంలో నివేదిక సమర్పించారు. సహజంగా నారా చంద్రబాబు నాయుడు ఐఏఎస్ లను తిట్టరు! అధికారులతో ఎంతో గౌరవంగా ఉంటారు! అలాంటిది తిరుపతి గర్జన సభలో జి.యన్.రావును యూజ్ లెస్ ఫెలో అని తిట్టడం, అప్పట్లో సంచలనం అయ్యింది.1988 బ్యాచ్ కు చెందిన గోపిశెట్టి నాగేశ్వరరావు గుంటూరు కలెక్టర్ గా ప్రస్థానం ప్రారంభించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అనేక కీలక పోస్టుల్లో పని చేశారు. పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శిగా చేశారు. రవాణా శాఖ, ఉన్నత విద్యా శాఖ, పౌర సరఫరాల శాఖ, టెక్స్ టైల్ శాఖ కమిషనర్ గా, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ గా పని చేశారు. రిటైర్డ్ అయ్యాక అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఆయన్ని శిల్పరామం స్పెషల్ ఆఫీసర్ గా నియమించారు. ఎక్కడున్నా ఆయన తన ఉనికిని ఏదొక విధంగా చాటేవారు! ఆయనకు నచ్చినట్లుగా చేసేవారు! చాలాసార్లు ప్రభుత్వ నిర్ణయాలు నచ్చక నిర్లక్ష్యం వహించి కొరకరాని కొయ్యగా గుర్తింపు తెచ్చుకున్నారు. రేపు శుక్రవారం జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో వారి అంత్యక్రియలు జరుగుతాయి.

## పర్వతాపూర్ లో హైడ్రా కూల్చివేతలు

**మేడ్చల్, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్ లోని కబ్జాకు గురైన ముస్లిం, క్రిస్టియన్ స్మశాన వాటికలలోని అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేసారు. గురువారం ఉదయం నుండి కూల్చివేతలు కొనసాగాయి. సర్వే నంబర్ లు 1, 12 లోని స్మశాన వాటికలను కబ్జా చేసి కబ్జాదారులు అమ్మేసారు. బుధవారం ఉదయం మేడిపల్లి లోని సేజ్ స్కూల్లోని అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేసారు. నిన్న మధ్యాహ్నం బోడుప్పల్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ముస్లిం, క్రిస్టియన్ స్మశాన వాటికలను పరిశీలించిన రంగనాథ్, కచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చిన ఉదయం నుండే హైడ్రా బృందాలు దిగి కూల్చివేతలు చేపట్టారు..గత రెండు ఏళ్లుగా స్మశాన వాటికలు కబ్జాకు గురైయాయి.

## భాగ్యరెడ్డి వర్మ కి ఘన నివాళు లర్పించిన డి.ఎస్.పి,రెహమాన్



**భద్రాద్రి కొత్తగూడెం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.... అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప మహనీయులు, గొప్ప సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని అన్నారు. భాగ్యరెడ్డి అసలు పేరు మ్యాదరి భాగయ్య అని,ఎన్నో పోరాటాల ఫలితంగా వర్మ అనే బిరుదు వచ్చిందని అన్నారు.సమాజంలో అందరూ సమానమే అని,సమసమాజ నిర్మాణం కోసం పోరాటం చేసారని అన్నారు.అణగారిన,దళితుల అభివృద్ధికి విద్యాసంస్థలు నెలకొల్పి వారి జీవితాల్లో విద్య తో వెలుగులు నింపారని కొనియాడారు.జగన్ మిత్ర మండలిని స్థాపించి దళితుల చైతన్యం కోసం పాటుపడ్డారని అన్నారు.దేవదాసి,జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపి వారి కోసం కృషి సల్పారని అన్నారు. వారి జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఆర్.ఐ లాల్ బాబు, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,ఎం.టి.ఓ సుధాకర్,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ పూజలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు....



**శేరిలింగంపల్లి, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మియాపూర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం లో రాచమళ్ళ కృష్ణ గౌడ్ మరియు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.బీజేపీ సీనియర్ నాయకులు నాగుల్ గౌడ్ ఆహ్వానం మేరకు బీజేపీ సీనియర్ నాయకులు,మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్,మాజీ అధ్యక్షులు మాణిక్ రావు,గుండె గణేష్ ముదిరాజ్,మన్నే సురేష్ ముదిరాజ్ శ్రీను,కొంచె శివరాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చిన్నపాటి వర్షానికి జలమయమైన నాగారం మున్సిపాలిటీలోని సాయి రత్న కాలనీ

### ఏళ్ల తరబడి వెంటాడుతున్న డ్రైనేజీ సమస్య





**కీసర, నాగారం, మే,22:(వార్తా ప్రభ)** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సాయి రత్న కాలనీ మరియు పలు కాలనీలలో ఏళ్ల తరబడి డ్రైనేజీ సమస్య వెంటాడుతుంది. బుధవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి చెరువును తలపిస్తున్న నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక డ్రైనేజీ ద్వారా వెళ్లవలసిన వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో జలమయమైన కాలనీలు, మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీలు ఇదే సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. డ్రైనేజీ సమస్య గురించి ఏళ్ల తరబడి నాయకులకు మున్సిపల్ సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టిన గాని ఈ సమస్యను పట్టించుకోవడం లేదు అని నాగారం మున్సిపాలిటీలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తవి వేయకపోవడం కాగా ఇంతముందు వేసినవి వాటిని అయినా డ్యామేజీ అయిన దగ్గర మరమ్మతులు చేసినా గాని కొంతవరకు ఈ సమస్య నుంచి బయటపడవచ్చు కానీ కొత్తవి వేయడం లేదు పాతవి కూడా మరమ్మతులు చేయించడం లేదు. ఇప్పటికైనా నాయకులు, సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కారం చేయాలని ప్రజలు కోరుచున్నారు.

## ఇంట్లోనే స్కానింగ్..

### అబార్షన్ వికటించి వివాహిత మృతి

**నల్లగొండ, మే,22:(వార్తా ప్రభ)** నకిరేకల్ లో ఇంట్లోనే స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేసుకొని స్కానింగ్ తీస్తూ లింగ నిర్ధారణ చేస్తున్న వైనం మరోసారి బయటపడింది. నిందితుడు యాదగిరిపై గతంలో పలు కేసులు నమోదు అయ్యాయి. రెండు రోజుల క్రితం సూర్యాపేట జిల్లా మోతే గ్రామానికి చెందిన అనూష అనే మహిళకు స్కానింగ్ తీసి లింగ నిర్ధారణ చేసాడు యాదగిరి . టేకుమట్ల గ్రామానికి చెందిన ఓ ఆర్ ఎం పి అనూషను యాదగిరి ఇంటికి స్కానింగ్ కోసం తీసుకొచ్చినట్లుగా సమాచారం. అనూష కు ఇప్పటికి ఇద్దరు ఆడపిల్లలు మరోసారి ఆడపిల్ల అని నిర్ధారణ చేయడంతో అబార్షన్ కి అనూష కుటుంబ సభ్యులు సిద్ధపడ్డారు.

# టిడిపి శ్రేణుల పండుగ "మహానాడు" : ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

● సందడి వాతావరణంలో ఘనంగా జరిగిన గుడివాడ టిడిపి మినీ మహానాడు.. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా పాల్గొన్న టిడిపి శ్రేణులు.. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపిన ఎమ్మెల్యే రాము ప్రసంగం..





**గుడివాడ,మే 22 (వార్తాప్రభ) :** ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు మహానాడు పండగ వంటిదని ఆర్టీసీ చైర్మన్, టిడిపి అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అన్నారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గస్థాయి టీడీపీ మినీ మహానాడు బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాము మరియు పార్టీ నాయకులు పూలమాలలతో నివాళులర్పించి జోహార్ ఎన్టీఆర్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు మూల స్తంభాలని, దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. జగన్ హయాంలో రాష్ట్రంలోని అన్ని రంగాలు విచ్ఛిన్నమై రాష్ట్రం అప్పుల ఊబిల్లోకి వెళ్లిందని పేర్కొన్నారు. సీఎం చంద్ర బాబు రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలో నడిపించేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సూపర్-6 పథకాలను ఇప్పటికే మూడు అమలు చేయగా ఆగుస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ఆచరణలోకి రానుందన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఎన్నికల అనంతరం నేను అమెరికా వెళ్ళిపోతానని పిచ్చి వాగుడులు వాగిన వ్యక్తి.. నేడు ఎక్కడకు పారిపోయి దాక్కున్నాడని ప్రశ్నించారు. దేవుడు లాంటి చంద్రబాబు, యువ నేత లోకేష్ లపై సైకో మాదిరి మాట్లాడుతూ పేట్రేగి పోయిన వంశీ కి పట్టిన గతే గుడివాడ మాజీ ఎమ్మెల్యేకు కూడా పడుతుందని ఎమ్మెల్యే రాము జోస్యం చెప్పారు. ఏపీ ఎస్.డబ్ల్యూ.సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ మహిళలను, బడుగు, బలహీనవర్గాలను అన్నివిధాలా ముందుకు నడిపించారని, అదే బాటలో సీఎం చంద్రబాబునాయుడు నడుస్తూ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజక పాలన జరుగుతుందని, ఇది నిజమైన ప్రజా ప్రభుత్వమని, రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సభా వేదికపై సీనియర్ టిడిపి నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధిలో అందరం భాగస్వామ్యం అవుతున్నామని నాయకులు పేర్కొన్నారు. సభా వేదికపై ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా.. ఈ క్రమంలో విద్య, ఉపాధి, పరిశ్రమలు అంశంపై కృష్ణాజిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకురాలు నూకాలమ్మ యాదవ్, నాయకులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జి, సాయన పుష్పవతి, లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, యార్లగడ్డ రవి, గోకవరపు సునీల్, అబ్దుల్ సత్తార్, జానీ షరీఫ్, అంగదాల శ్రీను, గుడివాడ నియోజకవర్గ పరిధి లోని టిడిపి నేతలు, ప్రజా ప్రతినిధులు, తెలుగు మహిళలు, తెలుగు యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, మండల, వార్డు కమిటీల పెద్దలు, టిడిపి అనుబంధ విభాగాలు నాయకులు, వేలాదిగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# లారీ యూనియన్ అధ్యక్షునిగా నల్లా శ్రీరాములు ఏకగ్రీవ ఎన్నిక



**అమలాపురం,మే 22 (వార్తాప్రభ) :** డాక్టర్.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లారీ యూనియన్ అధ్యక్షుని గా నల్లా శ్రీరాములు ( రాంబాబు), గౌరవ అధ్యక్షునిగా కురచ నాగేశ్వరరావు, ఉపాధ్య క్షునిగా కోరసిక శ్రీనివాసరావు, కార్యదర్శిగా పోలిశెట్టి రాంబాబు, జాయింట్ సెక్రటరీ లుగా నల్లా భాస్కరరావు,అల్లూరి బాల సురేంద్ర వర్మ, ట్రెజరర్ గా షేక్ నజరుద్దీన్,ముఖ్య సలహాదారుడుగా అడపా జనార్దన్ రావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి శ్రీ ఆంజనేయ స్వామి శక్తినివ్వాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొనీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే రాము..




**గుడివాడ,మే 22 (వార్తాప్రభ) :** రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తూ, ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి శ్రీ ఆంజనేయ స్వామి వారు శక్తిని ప్రసాదించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. పట్టణంలో వైభవోపేతంగా జరుగుతున్న శ్రీ హనుమజ్జయంతి వేడుకల్లో కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గుర-ువారం ఉదయం పాల్గొన్నారు. ముందుగా పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బంటుమిల్లి రోడ్డులోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా దేవస్థాన సాంప్రదాయం ప్రకారం దేవాదాయ శాఖ అధికారులు వేద పండితులు ఎమ్మెల్యే రాముకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి సమర్పించనున్న పూజా సామాగ్రిని శిరస్సుపై ఉంచుకొని దేవస్థానం చుట్టు ఎమ్మెల్యే రాము ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే రాము ప్రత్యేక పూజలు చేయగా, వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం రైతు బజార్ వద్ద గల శ్రీ భక్తాంజనేయ స్వామి, పెద ఎరుకపాడులోని శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానాల్లో జరుగుతున్న వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాము, స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. రైతు బజార్ వద్ద జరుగుతున్న వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న లక్ష్మీ గణపతి హెూమ పూజలో పూర్ణకుంభం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్.డబ్ల్యూ సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, కూటమి పార్టీల నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు, సాంబశివరావు, దారపురెడ్డి మణిశ్వరరావు, పందిళ్ళ మల్లి, దారపురెడ్డి శేషు, పెద్ది కిషోర్, పంచకర్ల మహేష్, సాయి, వేద పండితులు, ఆలయాల కమిటీల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# హనుమజ్జయంతి మహోత్సవాల్లో మజ్జిగ పంపిణీ చేసిన భక్తులు



**హనుమాన్ జంక్షన్, మే 22 (వార్తాప్రభ) :** హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా భక్తులకు పాదచారులకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ యనమదల రమేష్ ఆధ్వర్యంలో 500 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ గ్లోబల్ ప్రసిడెంట్ తాడి రంగారావు ప్రారంభించారు, భక్తుల దాహార్తి ని తీర్చేదుకు మజ్జిగ పంపిణీ చేపట్టిన రమేష్ అభినంద నీయుడని అయన అన్నారు ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ యనమదల శ్రీనివాసరావు, కంటిపూడి పుల్లయ్య చౌదరి, కటకం నాగేశ్వరావు, దమ్మాలపాటి హరిబాబు, యనమదల వేణు గోపాల్, గుళ్ళపల్లి దుర్గారావు, తదితరులు పాల్గున్నారు. కాగా పుట్ట గుంట పున్నమ్మ షాపింగ్ మాల్ వద్ద షాపుల యాజమానుల ఆధ్వ ర్యంలో. మజ్జిగ పంపిణీ చేశారు,అలాగే హనుమాన్ జంక్షన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా నిరవధికంగా మజ్జిగ పంపి ణీ చేశారు. అలాగే హనుమాన్ దేవాలయం వద్దనుండి అన్నసమా రాధన జరిగే వేలేరు అడ్డరోడ్డు వరకు ఎవరికి వారే స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ, మొక్కల పంపిణీ, మామిడి పండ్లు పంపిణీ చేశారు.

# మండలం లోని చౌటపల్లి శివారులో ముగ్గురు గుర్తు తెలియని మహిళలు, ఇరువురు యువకులు సంచారం..




**తిరువూరు,మే 22 (వార్తాప్రభ) :** మండలం లోని చౌటపల్లి శివారులో ముగ్గురు గుర్తు తెలియని మహిళలు, ఇరువురు యువకులు సంచారం. ఊరు శివారు చెర్వు కట్టపై నుండి ఆటోలో గ్రామం లోకి ప్రవేశం. రాత్రి వేళ అనుమానంగా తిరుగుతుండటం తో వారిని నిర్బందించిన గ్రామస్తులు. మీరు ఎవరు, ఏ ఊరు, ఇటు వైపు ఎందుకు వచ్చారు అని అనుమానిత మహిళలు, యువకులను ప్రశ్నించిన గ్రామస్తులు. ఒకరికి ఒకరు పొంతన లేని సమాధానాలు చెప్తూ వారిలో వారు అర్ధం కాని భాషలో సంభాక్షించు కుంటున్న వైనం. గ్రామం లో గతం లో చోరీ ఘటనలు జరగటం, వీరి వాలకం చూస్తే తేడా గా ఉండటం తో బెంబేలెత్తు తున్న స్థానికులు. పోలీసులకు సమాచారం అందించిన స్థానికులు. సంఘటన స్థలానికి వచ్చి అనుమానితులను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించిన పోలీసులు. వీరు, ఎవరు, ఏ ప్రాంతం వారు ఇక్కడకు ఎందుకు వచ్చారు అనేది పూర్తి వివరాలు పోలీసు విచారణ లో తేలాల్సి వుంది.

# పట్టణంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు..

● శ్రీ అభయాంజనేయస్వామి.., శ్రీ గౌరీశంకరస్వామి వార్లకు విశేషలంకరణలు.. మాతృశ్రీమండలి సభ్యుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా మరియు కోలాటం నృత్యములు.. దేవస్థానాలకు పోటెత్తిన భక్తులు.. ఉచిత ప్రసాదములు, మజ్జిగ పంపిణి..





**గుడివాడ,మే 22 (వార్తాప్రభ) :** పట్టణంలోని దేవాలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బంటుమిల్లి రోడ్డులోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం, నాగవరప్పాడు లోని శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం, గౌరీ శంకర స్వామి వారి దేవస్థానం ఉపాలయమైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం, పెద ఎరకుపాడులోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం తదితర ఆలయాల్లో జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజాము నుండి స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వేద పండితులు తెలియజేశారు.

**శ్రీ గౌరీశంకరస్వామివారి దేవస్థానం నందు.. :** స్థానిక గౌరీ శంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరి శంకర స్వామి వారి దేవస్థానం యొక్క ఉపాయం అయినటువంటి శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు వార్షిక హనుమత్ జయంతి మహోత్సవములు సందర్భంగా గురువారం తెల్లవారుజామ-ున నాలుగు గంటల నుండి శ్రీ స్వామివారికి అత్యంత వైభవోపేతముగా విశేషాలంకరణలు మరియు స్వామివారికి ప్రీతికరమైనటువంటి అరటి పండ్లు తమలపాకులు మరియు మామిడికాయలతో అలంకరణలు గావించి విశేష పూజా కార్యక్రమంలో అత్యంత వైభవోపేతముగా నిర్వహించారు. మాతృశ్రీమండలి సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం 4.00 గంటల నుంచి హనుమాన్ చాలీసా మరియు కోలాటం నృత్యములు నిర్వహించడం జరిగినది. భక్తులకు శ్రీ స్వామివారి దర్శనార్థం ప్రత్యేకమైన ఏర్పాట్లు గావించి ఆలయ ప్రాంగణం నందు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఉచిత ప్రసాదములు మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో నిర్వహించడం జరిగినదని కార్య నిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలియజేసినారు. అలాగే సాయంత్రం శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవోపేతముగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ మండలి సభ్యులు మరియు ఆలయ అర్చక స్వామి శ్రీ గూడూరు రాజేష్ శర్మ గారు మరియు సిబ్బంది నున్న ఆనందరావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# జయహో శ్రీ విజయ మల్లేశ్వరి దేవి

● వైభవంగా ప్రారంభమైన అమ్మవారిజాతర మహోత్సవం



**పెడన,మే 22 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా పెడన మండలం దావోజీపాలెం గ్రామంలో శ్రీ విజయ అమలేశ్వరిదేవి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 11 రోజులపాటు జరగనున్నాయి. అంకెం వారి ఇలవేల్పు అయిన అమ్మవారి జాతర మహోత్సవాలు 11 సంవత్సరాలు ఒకసారి జరుగుతాయి. ఉదయము 6:03 శ్రీ విజయ అమలేశ్వరి దేవిని దించి అమ్మవారిని పావనాలని ధాన్యంలో నిలబెట్టి క్రతువు ప్రారంబించారు తదుపరి ఆడపడుచులు కోడలు మిగిలినవారు పసుపు కొట్టారు తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు మహా నైవేద్యం సమర్పించారు అనంతరం సాయంత్రం 4 గంటలకు సుడికపిరి నిర్వహించారు. అలాగే కోలాట భజన కార్యక్రమం ఆహుతులను విశేషంగా ఆకర్షించింది. శ్రీ విజయ ఆమలేశ్వరి దేవి ఫ్యామిలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# ఘనంగా హనుమత్ జయంతి వేడుకలు...



**పెనుగంచిప్రోలు,మే 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామం నుంచి లింగగూడెం గ్రామం వెళ్లే రహదారిలో కొలువుదీరి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ముందుగా అర్చక స్వామి అయిన శివరాంబొట్ల మణికంఠ స్వామివారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి అనంతరం స్వామివారిని అలంకరింపజేశారు, దాతల సహకారంతో తయారుచేసిన ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు, లింగగూడెం గ్రామంలోని భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

# ఎస్.డబ్ల్యూ. పి.సి. నిర్వహణపై సమావేశం



**ఆగిరిపల్లి,మే 22 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ప్రాజెక్ట్ వనరుల కేంద్రం ఏలూరు జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ప్రసంగరాజు మరియు ఎంపీడీవో బి.ఆనంద బాబు సమక్షంలో ఎస్ డబ్ల్యూ పిసి నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మీటింగ్ నిర్వహించడం జరిగినది. సదరు మీటింగులో ప్రసంగరాజు ఎస్ డబ్ల్యూ పిసి నిర్వహణపై పలు సూచనలు ఇచ్చి ఉన్నారు ప్రతిరోజు ప్రతి గ్రామంలో క్లాప్ మిత్రాల ద్వారా తడి చెత్త మరియు పొడి చెత్త కలెక్షన్ చేసి సదరు చెత్తను ఎస్ డబ్ల్యూ పిసికి తరలించి తద్వారా వర్మీ తయారుచేయు విధానమును వివరించారు. మరియు ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ మరియు పోతవరప్పాడు ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ లను సందర్శించి పలు రికార్డ్స్ పరిశీలించినారు...

# అక్షయ పాత్రగా అన్న క్యాంటీన్లు



**అమలాపురం,మే 22 (వార్తాప్రభ) :** పేద,ధనిక తేడా లేకుండా అందరి ఆకలి తీర్చే అక్షయ పాత్రగా అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశు సంవర్ధక, మార్కెటింగ్ మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నా రు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 202వ అన్న క్యాంటీన్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానాన్ని మహా భాగ్యంగా భావించా లన్నారు.కేవలం రూ.5లకే భోజనాలు ఏర్పాటు చేయడం సామాన్య విషయం కాదని నాణ్యమైన భోజనం పరిశుభ్రమైన వాతావరణంలో పెట్టే విధంగా రాష్ట్ర ముఖ్య మంత్రి 15 రోజులకు ఒకసారి ఆర్టిజిఎస్, ఐ వి విఆర్ఎస్ ల ద్వారా లబ్ధిదారుల అభి ప్రాయాలను సేకరించడం జరుగుతుందన్నారు. తద్వారా 98% పనితీరు బాగుందని ప్రజాభిప్రాయం వెల్లడైం దన్నారు. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన అన్న క్యాం టీన్లు ప్రతి నియోజక వం-గంలో ఉండాలని సంకల్పించి మరో 70 అన్న క్యాంటీన్లకు టెండ ర్లు పిలవడం జరిగిందన్నారు. ఇకపై 175 నియోజకవర్గాలలో అన్న క్యాంటీన్లు నడు స్తాయన్నారు. వీటి నిర్వహణకై కమిటీని ఏర్పాటు చేసి సొసైటీని ఏర్పాటు చేసామన్నారు. స్థానికంగా పుర ప్రజలు తమ తమ జన్మదిన వేడుకలు సందర్భంగా అన్న క్యాంటీన్ లో ఆరోజు భోజన ఖర్చును విరాళంగా అందించవచ్చునని సూచించారు.క్యాంటీన్లు ఒక వరంగా మారి ఆకలిని తీర్చడంలో కీలక భూమిక పోషిస్తు న్నాయన్నక్యాంటీన్లో వీటి పుణ్యమా అని రోజువారీ కూలీలే కాదు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకొనే విద్యార్థులకు రూ.15 కే మూడు పూట లాకడుపు నింపుతోంద న్నారు. నిరుపేదల కడుపు నింపే అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంతో పేదల కళ్లల్లో ఆనందం కనిపి స్తోందన్నారు స్వచ్ఛమైన తాగునీరు అందించే సురక్షితమైన త్రాగు నీరు అందించే ఏర్పాట్లు, చేతులు శుభ్రం చేసుకునేం దుకు ప్రత్యేక ఏర్పాట్లు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నా క్యాంటీన్ల నిర్వహణకు చర్యలు తీసు కున్నామన్నారు.ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావం-ణం పేదల కడుపునింపి పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిబద్ధతతో కార్యక్రమాన్ని పునరుద్ధ రించినట్లు తెలిపారు. కేవలం రూ.5 లకే కడుపునిండా భోజనం పెట్టేందుకు రాష్ట్ర ప్రభు త్వం మళ్లీ అన్నా క్యాం టీన్లను పునరుద్ధ రించిందని తెలిపారు.ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారం భించిన అన్నా క్యాంటీన్లలో మెనూ ఖచ్చితంగా అమల య్యేలా చర్యలు తీసుకున్నా మన్నారు మంచి ఆహ్లాదకర, పరిశు భ్రమైన వాతా వరణం లో పేదలు భోజనం చేసేందు కు ప్రభుత్వం అవకాశం కల్పిం చిందన్నారు.ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టడం ద్వారా ఎంతో సంతృప్తి సొంత మవుతుందని, ఇలాంటి ఓ మంచి కార్య క్రమంలో భాగమవుతున్న సిబ్బంది నిబద్ధత, సేవా దృక్పథంతో సేవలు అందించాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జాయింట్ కలెక్టర్ నిషాంతి ప్రభుత్వ విప్, ముమ్మిడివరం దాట్ల సుబ్బరాజు, అంచనాల కమిటీ చైర్మన్ మండపేట, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనంద రావు, బండారు సత్యానందరావు అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఆర్డీఓ కె.మాధవి, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, మెట్ల రమణ బాబు మున్సిపల్ కమిషనర్ కె వి వి ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ అభ్యర్థి మీకు ఉన్నారా



**తిరువూరు,మే 22 (వార్తాప్రభ) :** వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ విలేకరుల సమావేశం నిర్వహించారు.స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడి రౌడీలా వ్యవహరిస్తావా అంటూ మండిపడ్డారు.మున్సిపాలిటీ చైర్మన్ ఎస్సీ రిజర్వేషన్ కు చెందినది, 17 మంది వైసిపి తరపున గెలిచారు.మీ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్ లలో ఎస్సీ అభ్యర్థి ఉన్నారా అని ప్రశ్నించారు.రక్షణ కోసం 6వ వార్డు కౌన్సిలర్ మా ఇంట్లో ఉంటే మా ఇంటిపైనే దాడులు చేయిస్తావా అంటూ మండిపడ్డారు.రక్షణ కల్పించాల్సిన పోలీసులు చోద్యం చూస్తూ మిన్నకుండిపోయారు. హైకోర్టును ఆశ్రయిస్తే మా కౌన్సిలర్స్ లకు రక్షణ కల్పించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కౌన్సిలర్లకు గన్ మెన్లను కల్పించిన దాఖలాలు మునుపెన్నడు లేవన్నారు.న్యాయస్థానంపై మాకు నమ్మకం ఉంది .. మా అభ్యర్థి మోదుగు ప్రసాద్ చైర్మన్ అవుతాడు.ఐఏఎస్, ఐపీఎస్ లకు కోచింగ్ ఇచ్చా అంటున్న కొలికపూడి ఇదేనా నీ సంస్కృతి అని నిలదీశారు.తిరువూరు మున్సిపాలిటిపై చర్చకు రావాలంటూ స్వామిదాస్ ఎమ్మెల్యే కొలికపూడికి సవాల్ విసిరారు.

